


తెనాలి : బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు

బెల్ సరే.. మరి నీళ్లెలా?

విద్యార్థులకు అందని శుద్ధ జలం

ఆంధ్రజ్యోతి ఫోకస్



- గుంటూరులోని ఎస్‌కేబీపీఎం(ఎన్జీవో కాలనీ), ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశా ల (చౌత్రా), ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల లో నెలలు తరబడి ప్లాంటు మూలన ఉన్నాయి.
- తెనాలి పట్టణం, రూరల్ మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్స్ ప్లాంట్స్ మూలన పడ్డాయి. ఐతానగర్, కొత్తపేట, మారీసుపేట, పెదరావూరు హైస్కూళ్లలో ఈ ప్లాంట్లు పని చేయడంలేదు.
- పొన్నూరు పట్టణ, మండల పరిధిలో 10 జడ్పీ ఉన్నత పాఠశాలలు, 2 మున్సిపల్ పాఠశాలల్లో గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు మూలన పడగా ఇటీవల పాఠశాల నిర్వహణ కమిటీలు వాటికి మరమ్మతులు చేయించడంతో అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన 96 మండల పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందని ద్రాక్షగానే మారింది. కొన్ని పాఠశాలల్లో మాత్రం స్థానిక దాత ల సహకారంతో రక్షిత మంచినీరు అందతోంది.
- ప్రత్తిపాడు మండల పరిధిలో 44 పాఠశాలలకు గత ప్రభుత్వ హయాంలో ఆర్వో ప్లాంట్లను సరఫరా చేశారు. వాటిని ఎవరు బిగిస్తారో.. ఎలా వాడాలో.. ఎవరికీ తెలియదు. వాటికి ఇంత వరకు ప్యాకింగ్ కూడా తొలగించలేదు.



గుంటూరు : ఎస్‌కేబీఎం స్కూల్లో రెండు సంవత్సరాలుగా ముసుగులో ఉన్న ఆర్వో ప్లాంటు

ఎండలు మండుతున్నాయి.. ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. అయినా విద్యార్థులు ఎండ వేడికి అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశాలల్లో 'వాటర్ బెల్' అమలు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. వేసవి తాపానికి గురికాకుండా విద్యార్థులకు గంటకో సారి మంచినీరు తాగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశించింది. అయితే వాటర్ బెల్ కొట్టినా విద్యార్థులకు శుద్ధ జలం ఎలా అందించాలో తెలియక ఉపాధ్యాయులు తల పట్టుకుంటున్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వందల్లో విద్యా ర్థులు ఉన్నా శుద్ధ జలం అందుబాటులో లేదం టే ఆశ్చర్యం కాదు. ఇక గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పథకంలో రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినా నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారాయి. చాలాదగ్గర్ల వాటిని ఇప్పటికీ బిగించలేదు. ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి లేదంటే పాఠశాల సమీపంలోనే నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి - గుంటూరు న్యూస్‌నెట్‌వర్క్)

ఎండలతో పాటు వాతావరణంలో వేడి రోజు రోజుకు తీవ్రమవుతోంది. దీంతో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా గంటగంటకు నీరు తాగేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో తాగునీటి వనరులు అందుబాటులో లేవు. ఇళ్ల నుంచి తెచ్చుకుంటేనే తాగునీరు అన్న పరిస్థితి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పథకంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే అవి మూణ్నాళ్ల ముచ్చటగానే పని చేశాయి. ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే ఆర్వో ప్లాంట్లు మూలనపడ్డాయి. వాటి మరమ్మతుల గురించి పట్టించుకునే వారే లేరు. అటు ఇటు అధికారులు, ఇటు సంబంధిత ఏజన్సీల వారు ఆర్వో ప్లాంట్ల గురించి పట్టించుకోవడంలేదు.

దీంతో పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు నిర్వహణ సక్రమంగా లేక మూతపడ్డాయి. ఈ పరిస్థితుల్లో పాఠశాలల్లో దొరికే నీరు శుభ్రంగా లేకపోవడంతో (మిగతా 6వ పేజీలో)

- పాఠశాలల్లో అలంకార ప్రాయంగా ఆర్వో ప్లాంట్లు
- రూ.లక్షలతో ఏర్పాటు.. నిర్వహణ లేక నిరుపయోగం
- కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ యంత్రాలను బిగించని వైనం
- మరమ్మతులపై ఫిర్యాదులను పట్టించుకోని ఏజన్సీలు

నిర్వహణ.. నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిని చాలాదగ్గర్ల బిగించలేదు. బిగించిన దగ్గర్ల మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారేలేరు. ఏర్పాటుతో సరిపెట్టిన కంపెనీల ప్రతినిధులు నిర్వహణ మరిచారు. ప్రధానోపాధ్యాయులు మరమ్మతుల సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించినా ప్లాంట్ల గురించి పట్టించుకునే వారే లేరు. ప్లాంట్‌లు బిగించిన వారికి ఫోన్ చేస్తే మొక్కుబడిగా మరమ్మతులు చేసి వెళ్తున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడంలేదు. దీంతో ఆర్వో ప్లాంట్లు ఆయా పాఠశాలలో మూలనపడి నిరుపయోగంగా ఉన్నాయి. స్కూల్ గ్రాంట్‌తో మరమ్మతులకు ప్రధానోపాధ్యాయులు సిద్ధమైనా ఆర్వోప్లాంట్ విడి పరికరాలు ఎక్కడా దొరడంలేదు. దీంతో ప్లాంట్‌ను పాఠశాలకు పంపిణీచేసిన ఏజన్సీ వారు వస్తే తప్ప వాటి మనుగడ కొనసాగలేని పరిస్థితి.

బిల్లులు.. బాధలు

- అప్పుల భారంతో కాంట్రాక్టర్లు సతమతం
- గతంలోనూ ఇప్పుడూ ఒకే తీరుగా అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.800 కోట్ల బకాయిలు
- బ్యాంకు ఖాతాలకు మార్చి 31 డెడ్‌లైన్.. ఆలోగా చెల్లించకపోతే ఎన్‌పీఏ

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టులు చేసిన నేరానికి చిన్నా చితక కాంట్రాక్టర్ల జీవితాలు చిన్నాభిన్నమైపోతున్నాయి. గత ప్రభుత్వం చేసిన పాపాలను కడిగేస్తున్న కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి (ఎంఎస్ఎంఈ) కేటగిరి కాంట్రాక్టర్లు సుమారు 450 మంది గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలకు సంబంధించి కాంట్రాక్టులు చేశారు. గుంటూరు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ సహా జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో కాంట్రాక్టులు చేసిన వీరికి గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో చేసిన పనలకు సంబంధించి రూ.150- 200 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు సంబంధించి రూ.50-70 కోట్లు, గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో రూ.100- 150 కోట్లు బకాయిలు ఉన్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో చేసిన పనులకు రూ.70 కోట్ల వరకు బకాయిలు ఉండగా, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పనులకు సంబంధించి రూ.10 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇవే కాకుండా కొవిడ్ సమయంలో ఆర్ అండ్ బీ పరిధిలో పలు చోట్ల పీహెచ్‌సీల నిర్మాణం, పాత వాటి ఆధునికీకరణలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.160 కోట్లు ఉండగా, ఒక్క గుంటూరు జిల్లాలోనే రూ.35 కోట్ల బకాయిలు ఉన్నాయి.

నిధులివ్వని గత ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా నిధులు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఒకవేళ ఇచ్చినా మొత్తం కాంట్రాక్టు ఖర్చులో 15 శాతానికి మించి ఇవ్వలేదని చెబుతున్నారు. అది కూడా సీరియల్ ప్రకారం కాకుండా అయిన వారికే ఇచ్చుకున్నారని వాపోతున్నారు. గత ప్రభు త్వం తెరమీదకు తెచ్చిన ఈ అడ్డదారినే ఈ ప్రభు త్వంలో కూడా అధికారులు కొనసాగిస్తున్నారని, దీంతో సామాన్య కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని తెలిపారు. సీరియల్‌ప్రకారం కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.


బ్యాంకుల నుంచి నోటీసులు

కాంట్రాక్టర్లు అనేక మంది బ్యాంకుల వద్ద ఓవర్ డ్రాఫ్ట్ రూపంలో అప్పులు చేస్తారు. వాటికి ఏ ఏడాదికా ఏడాది వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎవరూ వడ్డీలు చెల్లించలేదు. మరో మూడు రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం కూడా ముగుస్తుండడంతో వడ్డీలు చెల్లించని కాంట్రాక్టర్ల కు బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. మూడు రోజుల్లోపు వడ్డీలు చెల్లించకపోతే సదరు ఖాతాలను నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్(ఎన్‌పీఏ) జాబితాలోకి చేరుస్తామని నోటీసుల్లో హెచ్చరించాయి. ఒకసారి ఖాతా ఎన్‌పీఏ పరిధిలో పెడితే సంబంధిత కాంట్రాక్టరు స్థిర, చర ఆస్తులు వేలానికి వెళతాయని, ఆ ప్రమాదం నుంచి కాపాడమని కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు.

న్యాయం చేయాలి

ఎంఎస్ఎంఈ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి. చిన్న, సన్నకారు కాంట్రాక్టర్లు బిల్లులు రాక అప్పులపాలయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అనేక మంది పరిస్థితి అలానే ఉంది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. సీరియల్ ప్రకారం అందరికీ బకాయిలు చెల్లించాలి.

- ఎస్.విజయ్‌కుమార్, సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు



వరించిన పదవులు

- 3 జిల్లాలు.. ఐదుగురికి అవకాశం
- మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకం
- మిగతా ఏఎంసీలకు ఉగాదికి నియమించే అవకాశం

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):

ఉగాదిలోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించగా.. ఆయా పదవులు ఎవరిని వరిస్తాయోనని నేతలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పలు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవులను ప్రకటించారు. ఇందులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి ఐదు మార్కెట్ యార్డులు ఉండగా ఐదుగురిని ఏఎంసీ చైర్మన్ పదవులు వరించాయి. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీ కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయా యార్డులకు సంబంధించిన డైరెక్టర్లను త్వరలో నియమించనున్నారు. కాగా శుక్రవారం ప్రకటించిన చైర్మన్ పదవుల నియామకంపై స్థానిక కేడర్‌లో హర్షం వ్యక్తమవుతోంది. పార్టీ కోసం అహరహం శ్రమించిన వారికే పదవులు కట్టబెట్టారని కొనియాడుతున్నారు.

ఆశావహుల ఎదురుచూపు..

మార్కెట్ పాలక వర్గాలకు సంబంధించి మరికొందరికి డైరెక్టర్ పదవులు దక్కనున్నాయి. యార్డులకు సంబంధించి ఇప్పటికే రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ క్రమంలో చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ల పదవులకు పేర్లను ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. అయితే మరో రెండు, మూడు రోజుల్లో భారీ సంఖ్యలో పదవుల పందేరం జరిగే అవకాశం ఉండటంతో ఆశావహులు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు మార్కెట్(మిర్చి) యార్డు, దుగ్గిరాల మార్కెట్(పసుపు) యార్డు చైర్మన్ పదవులు అత్యంత కీలకమైనవి. గుంటూరు మార్కెట్ యార్డు ఆసియాలోకే పేరొందింది. దీన్ని జనరల్‌కు కేటాయించినట్లు సమాచారం. ఈ పదవి కోసం అనేక మంది సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న దుగ్గిరాల మార్కెట్ యార్డు పదవికి కూడా చాలామంది పోటీ పడుతున్నారు. ఈ యార్డును ఎస్సీలకు రిజర్వ్ చేసినట్లుగా సమాచారం. ఈ చైర్మన్ల నియామకం ఉగాదికి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

- జిల్లా కేంద్రమైన నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి టీడీపీ సీనియర్ నేత, పమిడిపాడుకు చెందిన పూనాటి శ్రీనివాసరావును వరించింది.
- సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కోమటినేని శోభారాణికి దక్కింది. సత్తెనపల్లి ఏఎంసీ చరిత్రలో తొలి మహిళా చైర్మన్ కావడం గమనార్హం. సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామానికి చెందిన శోభారాణి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు సతీమణి. 2013లో ఆమె ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమి చెందారు.
- మంగళగిరి యార్డు చైర్మన్‌గా జవ్వాది కిరణ్ చంద్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఆయన విద్యార్థి దశ నుంచే టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్నారు. పెదవడ్లపూడికి చెందిన కిరణ్ కుటుంబీకులంతా మొదటి నుంచి టీడీపీలో ఉన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన ప్రస్తుతం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు.
- బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కావూరి శ్రీనివాసరెడ్డిని వరించింది. ఆర్మీలో పనిచేసిన ఆయన 2014లో రాజకీయాలపై ఆసక్తితో టీడీపీలో చేరారు. బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. గత ఎన్నికల్లో క్లస్టర్ ఇన్ చార్జిగా వ్యవహరిస్తూ పార్టీ విజయం కోసం శ్రమించారు.
- అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా వరగాణి పద్మావతిని పదవి వరించింది.



బాపట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



అద్దంకి అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మావతి



పి. శ్రీనివాసరావు



జవ్వాది కిరణ్‌చంద్



ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన శోభారాణి

బాపట్ల - చీరాల మధ్య.. టూరిజం సర్క్యూట్

- బ్లూఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక
- అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక కేంద్రం
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



అడవిపల్లెపాలెంలోని వి రిసార్ట్స్‌లో వాటర్ పార్క్ ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య

6

పరిశ్రమలకు ప్రోత్సాహం

- జీడీపీఏ లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళిక
- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పరిశ్రమలను ప్రోత్సహించేలా పరిశ్రమలు, అనుబంధ శాఖల అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీడీవీఏ పరిశ్రమల రంగానికి 21.29 శాతం, సర్వీస్ రంగానికి 16.01 శాతం లక్ష్యాలను నిర్దేశించటం జరిగిందన్నారు. ఆ లక్ష్యాలు అధిగమించేలా, జిల్లా అవసరాలకు అనుగుణంగా డిమాండ్ ఉన్న పరిశ్రమలను పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసేలా అధికారులు అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో అగ్రి, ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉన్నందున పీఎంఎఫ్ఎంఏ ద్వారా మండలానికి ఐదు యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 70,000 మందిని, పట్టణ ప్రాంతాల్లో 70,000 మందిని లఖ్‌పత్ దీదీలుగా అభివృద్ధి చేసేలా డీఆర్డీఏ, మెప్మా ద్వారా స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులకు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు అవసరమైన స్థలాలను సేకరించేలా పరిశ్రమల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు గుర్తించిన ఎండోమెంట్ స్థలాలు లీజు ద్వారా సత్వరమే కేటాయించేలా రాష్ట్ర స్థాయి అధికారులతో పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో 32 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు పెట్టుబడి, వడ్డీ రాయితీ, పవర్ కాస్ట్ సబ్సిడీ రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రూ.కోటి 86 లక్షల 61 వేల 300 మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు.

- పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు నిర్దేశించిన కార్యక్రమాలపై శిక్షణ అందించి బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయించి యూనిట్లు సక్రమంగా గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (శనివారం సాయంత్రం) సహరి : 4.48 (ఆదివారం ఉదయం)

కోరం లేక కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక వాయిదా


ఎన్నికల అధికారి లింగమూర్తి

కారంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక రెండో రోజు శుక్రవారం కూడా వాయిదా పడింది. ఉప ఎంపీపీ ఎన్నికకు సంబంధించి 14 మంది ఎంపీటీసీలకు గాను పేటసన్నిగండ్ల ఎంపీటీసీ గాడిపర్తి రమాదేవి ఒక్కరే హాజరు కావడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి డీఈ లింగమూర్తి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రత్యేక సమావేశం 11 గంటలకు ప్రారంభం కాగా 12 గంటల వరకు వేచి చూసినప్పటికీ సభ్యులు హాజరుకాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తామని చెప్పారు.

కాటూరికి కళారత్న పురస్కారం


శిల్పి వెంకటేశ్వరరావు

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ అధినేత శిల్పి కాటూరి వెంకటేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డుతో సత్కరించనుంది. శిల్పాలను వివిధ రకాల మెటీరియల్స్‌తో తయారుచేసి దేశ విదేశాలలో సైతం ప్రత్యేక గుర్తింపు పొందడంతో ఉగాది పురస్కారాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును అందించనుంది.

దేశంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఆంధ్రప్రదేశ్ దిక్సూచి

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

గుంటూరు సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యం అవుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆరోగ్య ఎమర్జెన్సీ సమయంలో మానవాళి ఆరోగ్యం, రైతుల సంక్షేమంతో పాటు, భూ గ్రహ పరిరక్షణ కూడా ప్రకృతి వ్యవసాయంపైనే ఆధార పడిందని అభిప్రాయపడ్డారు. జాతీయ మిషన్ కార్యక్రమ అమలులో భాగంగా మేనేజ్ జాతీయ సంస్థ ఆర్థిక సహకారంతో గుంటూరులో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన మూడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం చివరి రోజున విజయ్ కుమార్ వర్చువల్‌గా శిక్షణకు హాజరైన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు కూడా వాతావరణంలో వస్తున్న పెను మార్పులకు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత తరహాలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో విస్తృతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో ఏర్పాటైన మిషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని దేశ వ్యాప్తంగా విస్తరించాలని కోరారు. ప్రకృతితో మమేకమై ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు అమలవుతున్నాయని, ప్రస్తుతం అనుసరిస్తున్న రసాయన వ్యవసాయ విధానాలపై పునరాలోచించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం వెనుక దాగి ఉన్న శాస్త్రీయత, సార్వత్రిక సూత్రాలు, అనుసరిస్తున్న విధానాలు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ, సెర్ప్ అధికారులకు ఏ మేరకు అవగాహన కలిగింది అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. అంతకు మునుపు రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వరప్రసాద్ ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్రంలో చేసిన వివిధ పరిశోధనల ఫలితాల గురించి వివరించారు.


రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

సీనియర్ థిమాటిక్ లీడ్ డాక్టర్ జాకీర్ ప్రకృతి వ్యవసాయంలో పంటల నిరోధకత (క్రాప్ రెసిలియన్స్) పై అధికారులకు అవగాహన కల్పించారు. గోపీచంద్ ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అవసరం అయ్యే ప్రణాళిక, శిక్షణలు, క్షేత్ర స్థాయి కార్యక్రమాల గురించి విపులంగా విశదీకరించారు. చంద్రశేఖర్ క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు దోహదం చేసే కార్యక్రమాలు, నాన్ పెస్ట్ మేనేజ్‌మెంట్ దుకాణాలు, మహిళా సంఘాల పాత్ర గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్ లు రామచంద్రం, రాజేశ్వర్ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, సెర్ప్ నుంచి డీపీఎం, ఏపీఎం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రకృతి వ్యవసాయంపై అనేక రకాలుగా అవగాహన కల్పించినందుకు రైతు సాధికార సంస్థకు, మేనేజ్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు.

ఈకేవైసీ నమోదుకు ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు

● ఎండీయూల ద్వారా కూడా చేసేందుకు ప్రతిపాదన ● కార్డుదారుల ఆందోళన తొలగిస్తూ ప్రభుత్వ ఆదేశాలు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రేషన్‌కార్డులోని సభ్యుల పెండింగ్ ఈకేవైసీ ప్రక్రియని పూర్తి చేయడానికి ప్రభుత్వం గడువు పొడిగించింది. తొలుత ఈ నెలాఖరు వరకే ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే చాలామంది సభ్యులు అందుబాటులో లేకపోవడం, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉండటం వంటి కారణాలతో ఈకైవేసీ సంపూర్ణం కాలేదు. దీంతో మరో నెల పాటు గడువుని పొడిగిస్తూ శుక్రవారం సాయంత్రం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయాలకు సమాచారం పంపించింది. ఈకేవైసీ పెండింగ్ ఉన్న వాళ్లకు ఏప్రిల్ నెల రేషన్ పంపిణీ నిలిచిపోతుందని ఎవరూ ఆందోళన చెందవద్దని, మరో నెల పాటు గడువుని ప్రభుత్వం పొడిగించిందని గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పౌరసరఫరాల అధికారులు సమాచారం ఇవ్వడం ప్రారంభించారు.

ఆధార్ అథెంటికేషన్ ద్వారా ఈకేవైసీ ప్రక్రియని పూర్తి చేస్తారు. ఇది ఒక విధంగా ఈపీఎఫ్‌వో ఫించన్‌దారులు ఏ విధంగా అయితే ఏటా లైఫ్ సర్టిఫికేట్‌లు ఇస్తారో అలాంటి ప్రక్రియే. ఎప్పటినుంచో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది సభ్యుల ఈకైవేసీ పెండింగ్‌లో ఉన్నది. గుంటూరు జిల్లాలో 1,34,943, పల్నాడు జిల్లాలో 1,68,886, బాపట్ల జిల్లాలో 95,780 మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇప్పటికే ఎవరివైతే ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయో వారి వివరాలతో కూడిన లిస్టులను విడుదల చేశారు. అయితే కొంతమంది మాత్రమే ముందుకొచ్చి ఈకేవైసీని రేషన్ దుకాణాల్లో చేయించుకొన్నారు. ఇంకా చాలామందివి అలానే పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు కారణం విద్యార్థులు హాస్టల్స్‌లో ఉండటం, వ్యవసాయ కార్మికులు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉండటమే. అలానే కొంతమంది చనిపోయినప్పటికీ వాళ్ల పేర్లను స్వచ్ఛందంగా తొలగించకుండా ప్రతీ నెలా రేషన్ పొందుతున్నారు.

ప్రస్తుతం ఈకేవైసీ ప్రక్రియ రెండు వ్యవస్థల ద్వారానే జరుగుతున్నది. రేషన్ డీలర్ల వద్ద ఈ-పోస్ యంత్రాలలో ఆధార్ అథెంటికేషన్(వేలిముద్ర) వేసి చేసుకోవచ్చు. వీఆర్‌వోల వద్ద అయితే ఆధార్‌తో పాటు ఐరిస్, ఫేస్ రికగ్నిషన్ ద్వారా కూడా ఈకేవైసీ చేసుకొనే సదుపాయం ఉన్నది. ఈ సదుపాయాన్ని ఎండీయూ ఆపరేటర్లకు కూడా కల్పించాల్సిందిగా స్థానిక అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీని వలన రేషన్ పంపిణీకి ఎండీయూ వెళ్లినప్పుడు సరుకులు తీసుకోవడానికి వచ్చే వారి కుటుంబాల్లో ఎవరి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందో వాళ్లు చెబుతారు. దాంతో అక్కడే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి అవుతుందని గుంటూరు జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ తెలిపారు. అధికారికంగా ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే ఆ వివరాలను తెలియజేస్తామన్నారు.

పోలీసు, రెవెన్యూ కలిసి పని చేస్తే శాంతి భద్రతలు పరిరక్షించవచ్చు

- స్పెషల్ ఐజీ చంద్రశేఖర్ - రౌడీషీటర్‌కు రిమాండ్ విధించిన తహసీల్దార్ గోపాలకృష్ణకు పోలీసుల సన్మానం

తెనాలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్‌కు మేజిస్ట్రేట్ హోదాలో తహసీల్దార్ రిమాండ్ విధించిన సంఘటనలలో తహసీల్దార్‌ను పోలీసు శాఖ ఘనంగా సత్కరించింది. నేరాల అదుపు కోసం పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేస్తే శాంతి భద్రతలు నెలకొంటాయని స్పెషల్ ఐజి చంద్రశేఖర్ అన్నారు. తెనాలి తహసీల్దార్‌గా పని చేస్తున్న కెవి గోపాలకృష్ణ ఇటీవల ఓ రౌడీషీటర్‌కు 30 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారు. తెనాలి వైకుంఠపురానికి చెందిన అన్నం సతీష్ అనే రౌడీషీటర్‌ను పలు దౌర్జన్యకర సంఘటనలు, కొట్లాటకు సంబంధించిన కేసుల్లో వన్ టౌన్ పోలీసులు తహసీల్దార్ ముందు ఇటీవల బైండోవర్ చేశారు. అప్పుడే సంవత్సరం పాటు సత్‌ప్రవర్తనతో ఉండాలని, ఆ షరతులను ఉల్లంఘిస్తే రూ.2 లక్షలు జరిమానాతో పాటు జైలుకు కూడా పంపుతామని ఒప్పంద పత్రంపై సంతకాలు చేయించి పంపారు. ఇది జరిగిన రెండు నెలలకే ఆ రౌడీషీటర్ మరో యువకుడిని చితకబాది డబ్బులు దోచుకున్న సంఘటనలో వన్ టౌన్ పోలీసులు వారం క్రితం తెనాలి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. దీనికి ముందు రెండుసార్లు అతనికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం, ఆగడాలు ఆపకపోవడంతో తీవ్రంగా పరిగణించిన తహసీల్దార్ మేజిస్ట్రేట్ హోదాలో చట్టం పరిధికి లోబడి అతనికి 30 రోజులు రిమాండ్ విధించారు. అప్పుడే రేపల్లె సబ్‌జైలుకు కూడా తరలించారు. అయితే ఈ సంఘటన పోలీసు, రెవెన్యూ వర్గాలలో చర్చనీయాంశమైంది. తహసీల్దారే నేరుగా రిమాండ్ విధించడం అరుదైన సంఘటన కావడంతో శుక్రవారం గుంటూరులో జరిగిన క్రైం మీటింగ్‌లో తహసీల్దార్ గోపాలకృష్ణను స్పెషల్ ఐజి చంద్రశేఖర్, గుంటూరు ఎస్పి సతీష్‌కుమార్‌లు ఘనంగా సత్కరించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి పని చేయడంతో పాటు ఉన్న అధికారాలను సద్వినియోగం చేస్తే చాలా నేరాలను అదుపు చేయవచ్చని ఐజి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫలితంగా న్యాయ వ్యవస్థపైన ఒత్తిడి తగ్గుతుందని, నేరాలు కూడా చాలా వరకు కట్టడి అవుతాయని పేర్కొన్నారు. ఇదే సంఘటనకు సంబంధించి తెనాలి వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావుకు రూ.25 వేల నగదు బహుమతిని ఎస్పి సతీష్‌కుమార్ అందించారు. నా డ్యూటీని చట్టపరిధిలో ఉన్న నా అధికారాలను అమలు పరిచానని దీని కోసం ప్రత్యేకించి సొంత నిర్ణయాలు తీసుకోలేదని, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్‌ఎస్‌ఎస్) తహసీల్దార్‌లకు కల్పించిన అధికారాలను అందరూ సద్వినియోగం చేస్తే చాలా వరకు నేరస్తులను కట్టడి చేయవచ్చని ఆ పనే నేను చేశానని, దీనికి పోలీసు శాఖ నన్ను సత్కరించడం సంతోషం కలిగించిందని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

మాచవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4.75 కోట్లు ఉపాధి హామీ పనులు జరిగాయని వీటిలో రూ. 4.56 కోట్లు ఉపాధి కూలీల వేతనం కాగా రూ. 19 లక్షలు మెటీరియల్ పనులు జరిగాయని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వెంగళరావు అధ్యక్షత వహించగా, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల వారీగా జరిగిన పనులపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగణేషునిపాడు గ్రామానికి చెందిన సర్పంచ్ పల్లా నరేంద్ర, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షయ్యలు మాట్లాడుతూ, కొత్తగణేషునిపాడు గ్రామంలోనే అంగన్‌వాడీ కార్యకర్తకు, వేరే గ్రామాల్లో పని చేస్తున్న సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు, బంధువులకు పూర్తిగా పక్షవాతం వచ్చి మంచంలో ఉన్న వారికి ఇలా రకరకాలుగా పనికి వెళ్ళక పోయినప్పటికీ వారి పేర్లపై స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ వేతనాలు వేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై గ్రామంలో పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పల్లా నరేంద్ర, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షయ్యలు డ్వామా పీడీకి రాత పూర్వకంగా అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా పీడీ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ గ్రామంలో ఏపీడీ ద్వారా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలను పునరుద్ధరించటం, చెరువులను, కుంటలను అభివృద్ధి పరచడం, కూలీలకు దినసరి వేతనం మూడు వందలు వచ్చే విధంగా స్థానిక అధికారులు పనులు చేయించాలని పీడీ ఆదేశించారు. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతా యుతంగా వ్యవహరించి పనులు సక్రమంగా చేయించి వారికి సక్రమంగా వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంగళరావు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబల ప్రదర్శనను జయప్రదం చేద్దాం

తెనాలి రూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో శనివారం నుంచి ఏప్రిల్ 4 వరకూ జరగనున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఎడ్లబల ప్రదర్శన, పశు పాల పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాలకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్ పాల్గొని ఎడ్లబలప్రదర్శనను, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 40 వార్డులో, గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పార్టీ నాయకులు

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

నేర సమీక్షా సమావేశంలో ప్రత్యేక ఐపీఎస్ అధికారి హరికృష్ణ

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా పోలీసు విభాగానికి నేర సమీక్ష, పర్యవేక్షణ అధికారిగా ప్రభుత్వం నియమించిన ప్రత్యేక ఐపీఎస్ అధికారి హరికృష్ణ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్చి నెల నేర సమీక్షా సమావేశానికి ఐపీఎస్ అధికారి హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు అంశాలపై సమీక్ష నిర్వహించి, నేరాల పరిశోధన, నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా పోలీసు విభాగానికి నేర సమీక్ష పర్యవేక్షణ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఐజీ హరికృష్ణ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను సీసీటిఎన్‌ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం)లో ఎప్పటికప్పుడు పొందుపరుస్తూ ఉండాలని, దీనివలన ఏదైనా వ్యక్తి తరచుగా నేరాలకు పాల్పడుతుంటే అతనిపై నమోదైన కేసులను సులభంగా కనిపెట్టవచ్చని అన్నారు. దాంతో అతనిపై కఠిన చర్యలు తీసుకోవచ్చు అని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత స్టేషన్ హౌస్ అధికారిదేనన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన కూడళ్లు, జనసంచారం కలిగిన ప్రదేశాలు, నేరాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా కేసుల పరిశోధనలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ నగదు రివార్డులను అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి (అడ్మిన్), కె సుప్రజ (క్రైమ్స్) , ట్రైనీ ఐపీఎస్ దీక్ష , ఎస్బి డిఎస్పీ సీతారామయ్య, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులకు ఆదేశాలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు మీదగా నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వారాంత రద్దీ దృష్ట్యా ఏప్రిల్, మే నెలల్లో ప్రతీ ఆదివారం నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07201 నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైలు ఏప్రిల్ 6వ తేదీ మొదలుకొని మే 25వ తేదీ వరకు ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 2.20కి బయలుదేరి సాయంత్రం 6.25కి గుంటూరు, రాత్రి 7.14కి నరసరావుపేట, సోమవారం ఉదయం 8.55కి యలహంక, మధ్యాహ్నం 12.45కి అర్సికెరెకు చేరుకొంటుంది. నంబరు. 07202 అర్సికెరె - నరసపూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 7వ తేదీ మొదలుకొని మే 26వ తేదీ వరకు ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.45కి యలహంక, మంగళవారం ఉదయం 6.24కి నరసరావుపేట, 7.20కి గుంటూరు, మధ్యాహ్నం 1 గంటకు నరసపూర్ చేరుకొంటుందన్నారు.

గుంటూరు మీదగా రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట - కొండపల్లి మధ్యన మహబూబాబాద్ స్టేషన్‌లో మూడో రైలు మార్గం ప్రీనాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను గుంటూరుమీదగా దారి మళ్లిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. విశాఖపట్టణం - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని మే 22 నుంచి 28వ తేదీ వరకు, షాలిమార్ - హైదరాబాద్ రైలుని మే 27, 28 తేదీల్లో, హైదరాబాద్ - షాలిమార్ రైలుని మే 28,29 తేదీల్లో, సీఎస్‌టీ ముంబై-భువనేశ్వర్ రైలుని మే 27,29 తేదీల్లో, భువనేశ్వర్ - సీఎస్‌టీ ముంబై రైలుని మే 27, 28 తేదీల్లో, సాయినగర్ షిర్డి - కాకినాడపోర్టు రైలు మే 27న, కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డి, సాయినగర్ షిర్డి- మచిలీపట్నం, షాలిమార్ - సికింద్రాబాద్ రైళ్లు మే 28న, ఎర్నాకుళం - బరౌని రైలు మే 23న పగిడిపల్లి మార్గంలో గుంటూరు మీదగా మళ్లించడం జరుగుతుందన్నారు.

వారం పాటు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

నిత్యం గుంటూరు-సికింద్రాబాద్ మధ్యన వరంగల్ మార్గంలో ప్రయాణించే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా వారం పాటు రద్దు చేస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్, నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరుఇంటర్‌సిటీ రైళ్లు మే23 నుంచి 29 వరకు రద్దు చేస్తున్నామన్నారు.

జూన్ వరకు కటక్, హైదరాబాద్ రైళ్ల పొడిగింపు

వారంలో ఒక రోజు గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న హైదరాబాద్, కటక్ రైళ్లను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ నెల చివరి వారం పొడిగిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 07165 హైదరాబాద్ - కటక్ రైలు ప్రతీ మంగళవారం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ 24వ తేదీ వరకు, నంబరు. 07166 కటక్ - హైదరాబాద్ రైలు ప్రతీ బుధవారం ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు పొడిగిస్తున్నామన్నారు.

ఉగాదికి ప్రత్యేక రైళ్లు

ఉగాది పండగకు ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07271 గుంటూరు - ఎస్‌ఎస్‌ఎస్ హుబ్లీ ప్రత్యేక రైలు ఈ నెల 31వ తేదీన రాత్రి 8 గంటలకు బయలుదేరి నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్లు, బళ్ళారి, తోర్నగల్లు, హోస్‌పేట, మునిరాబాద్, కొప్పల్, బానాపూర్, బన్ని కొప్ప, గడగ్, అన్నిగేరి మీదగా మరుసటి రోజు ఉదయం 9.20కి హుబ్లీ చేరుకొంటుంది. నంబరు. 07272 హుబ్లీ - గుంటూరు రైలు ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 11 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై 2వ తేదీ వేకువజామున 3 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. ఈ రైళ్లలో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విందులో వడ్డన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

దాన గుణమే భగవంతుని మార్గం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎదుటివారి కష్టంలో మనం పాలుపంచుకుంటే కలిగే సంతోషం వెలకట్టలేనిదని, పవిత్ర ఖురాన్ గ్రంథం కూడా ఇదే సారాంశాన్ని బోధిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు ఫోర్ వీలర్స్ ఆటో కన్సల్టేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలతో ఆప్యాయంగా మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు ఆచరించడం గొప్ప అదృష్టమని అన్నారు. ఉపవాస దీక్షలో ఆధ్యాత్మికతతోపాటు ఆరోగ్య సూత్రాలు కూడా దాగి ఉన్నాయని చెప్పారు. మనకు చేతనైనంతలో ఎదుటివారికి సాయపడాలని, ఇది దేవుని అనుగ్రహానికి పాత్రులను చేస్తుందని పేర్కొన్నారు.

సేవ, సమానత్వం కలయికే రంజాన్

● ఇఫ్తార్‌లో ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సేవ, సమానత్వం, సోదర భావం, క్షమా గుణాల కలయికే రంజాన్ మాస సారాంశమని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి పోలీస్ కళ్యాణమండపంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎస్పీ సతీష్‌కుమార్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని, పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు లాంటి కార్యక్రమాలు ప్రజలలో సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఆకులవారి తోటలోని నూర్ మసీద్ నుంచి వచ్చిన షేక్ ముప్తీ మన్సూర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(క్రైమ్స్) సుప్రజ , ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య, డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, అరవింద్, భానోదయ, సీఐలు అల్తాఫ్ హుస్సేన్, నజీర్ బేగ్, శ్రీహరి రెడ్డి, శివరామకృష్ణ , రామకృష్ణారెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ముస్లింలతో కలసి విందులో పాల్గొన్న ఎస్పీ, అదనపు ఎస్పీలు

ధార్మిక చింతనల కలయికే రంజాన్

● విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండుగని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శుక్రవారం ఇఫ్తార్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, వడ్లమూడి గ్రామ ముస్లింలతో కలిసి విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ వెనుక మానసిక, శారీరక వికాసం వంటి ఎన్నో విశేషాలు కూడా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విద్యార్థులు, వడ్లమూడి గ్రామ ముస్లింలు పాల్గొన్నారు.



ముస్లింలతో డాక్టర్ లావు రత్తయ్య

సంగీతంతో మానసిక ప్రశాంతత

● కలైమామణి రాజగోపాలన్

గుంటూరు(తూర్పు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నిరంతర సంగీత సాధన లేదా వినడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రముఖ వీణా విద్వాంసురాలు, కలైమామణి రాజగోపాలన్ అన్నారు. భారతీ విద్యాభవన్‌లో ఉన్న భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో సంగీత, సాహిత్య, నృత్య కళలను నేటి తరం ఆస్వాదించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ విద్యాభవన్స్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ చదువు, ఆటలతో పాటు భారతీయ సంగీత, సాహిత్య, లలిత కళలు అభ్యసించేలా భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ చేసిన సంగీత వీణ కచేరి, జయభాస్కరరావు, సరస్వతుల హనుమంతురావు నిర్వహించిన మృదంగ, ఘట జుగల్బందీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హేమాంబ, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ గోపాలన్, పాల్గొన్న రామచంద్రరాజు తదితరులు

కాంట్రాక్టర్ల బిల్లులు వెంటనే చెల్లించాలి

● సీఎంకు సబ్కా లేఖ

గుంటూరు సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల ను వెంటనే చెల్లించాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీఎంకు సబ్కా ప్రత్యేకంగా లేఖ రాయడం జరిగింది. గత ఐదేళ్ల కాలంలో బిల్లులు పెండింగ్‌లో ఉంచటం వల్ల జనార్దన్‌రెడ్డి, మల్లికార్జున్ ప్రసాద్, చాంద్ బాషా అనే కాంట్రాక్టర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారని లేఖలో పేర్కొన్నారు. పనులు చేసి రాష్ట్ర ప్రజలకు మౌలిక వసతులు కల్పించిన చాలా మంది కాంట్రాక్టర్లు రోజువారీ కూలీలుగా మారిన దుస్థితి ఏర్పడిందని వివరించారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులకు మోక్షం కల్పించాలని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.విజయ కుమార్, సెక్రటరీ సూర్య ప్రకాష్ విజ్ఞప్తి చేశారు.

నేడు డయల్ యువర్ డీపీటీవో

గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం శనివారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు డయల్ యువర్ జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీపీటీవో ఎం.రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల పరిధిలోని ఆర్టీసీ పరమైన సమస్యలు, సలహాలు, సూచనల కోసం ప్రజలు 9959225412 చేయాలని కోరారు.

నైట్ ఫుడ్ జోన్ల ఏర్పాటునకు చర్యలు

● కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి



బ్రాడీపేటలో ఫుడ్ కోర్టు జోన్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, ఎమ్మెల్యే మాధవి

గుంటూరు కార్పొరేషన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవిలు తెలిపారు. అధికారులతో కలిసి శుక్రవారం వారు అరండల్‌పేట 4వలైన్, పిచ్చుకల గుంట ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ వారు మాట్లాడుతూ నగరంలో నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ల ఏర్పాటుకు ఇప్పటికే బ్రాడీపేట 4వ లైన్‌ని పరిశీలించామన్నారు. అరండల్‌పేట 4వలైన్, పిచ్చుకలగుంట లైన్‌లు కూడా ఫుడ్ జోన్ల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటాయన్న సూచనలకు అనుగుణంగా పరిశీలించామన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ, నగరంలో ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుండో ప్రజలు కోరుతున్నారని, అందుకు అనుగుణంగా అనుకూలమైన ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తున్నామన్నారు. అలాగే శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు ప్రారంభానికి ముందే ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కోసం బ్రాడీపేట, అరండల్‌పేటల్లో రోడ్ల ఆక్రమణలను తొలగించుకోవడం, అవసరమైన ప్రాంతాల్లో విస్తరణ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యటనలో కార్పొరేటర్ ఎం.శ్రీవల్లి, డీఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు వ్యాపారులతో సమావేశం

నగరంలో నైట్ స్ట్రీట్ ఫుడ్ జోన్ల ఏర్పాటుపై వ్యాపారుల సూచనలు, సలహాలు కోరుతూ శనివారం సాయంత్రం 4 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశామని, నగరంలోని స్టేక్ హోల్డర్స్ సమావేశానికి హాజరై ఫుడ్ జోన్ ఏర్పాటుపై తమ సూచనలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఫుడ్ జోన్స్‌లో పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు ఎంపికైన ప్రాంతాలు, ఇతర ఏర్పాట్లపై స్టేక్ హోల్డర్స్ సూచనలు అందించడానికి శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని, వారు తమ అభిప్రాయాలు తెలియచేయాలని కోరుతున్నామన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు (విద్య), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యా శాఖ విడుదల చేసిన అన్ని కేడర్స్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలలోని అసంబద్దాలను, లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ సీవీ రేణుకకు శుక్రవారం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ డీఎస్సీల వారిగా విడుదల చేసిన మెరిట్ సీనియారిటీ జాబితాలలో మునిసిపల్, కార్పొరేషన్ మేనేజ్‌మెంట్‌లో సీనియారిటీ జాబితాలు సరి చేయాలని అన్నారు. 2019లో ఇచ్చిన స్కూల్ అసిస్టెంట్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (ఎల్ఎఫ్ఎల్‌హెచ్) సీనియారిటీ జాబితాలో వరుస క్రమం లోపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఎస్ఎన్ మూర్తి, కె.రమేష్, జి.దాస్, చక్కా వెంకటేశ్వర్లు, కిషోర్ షా పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు

గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ క్యాపిటల్ హోటల్ సమావేశ మందిరంలో శుక్రవారం డాక్టర్స్ గాట్ టాలెంట్ 2025 పేరుతో ముందస్తు ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మ్యాజిక్ షోలు, జోక్స్, కవితలు, పాటలు, స్కిట్స్, సినీ నృత్యాలతో ఆడి పాడారు. మానసిక వైద్యుడు డాక్టర్ సురేష్ కుమార్ సారథ్యంలో అనుమానం జబ్బు లఘు నాటిక, డాక్టర్ లత, డాక్టర్ ప్రశాంతిల హాస్య పంచాంగం ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ, వైద్యులు రామ్ తారకనాథ్, కారుమూరి శ్రీనివాసరెడ్డి, రామలింగేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమాలని డాక్టర్ రామ్ కుమార్, కమల నిర్వహించారు.

కూనంనేని వ్యాఖ్యలు వక్రీకరించారు : జంగాల

గుంటూరు(తూర్పు), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు అనుకూలంగా మార్చుకున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టూరిజం తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసుకుంటే ఆదాయం వస్తుందని కూనంనేని చెప్పారని అంతే తప్ప చంద్రబాబును మెచ్చుకోలేదని అన్నారు. కూనంనేని సాంబశివరావు చెప్పిన భావన వేరు...చంద్రబాబు నాయుడు చేసుకున్న అర్థం వేరే అని అన్నారు. ఆధార్ కార్డు అనుసంధానం కార్యక్రమాన్ని ఏప్రిల్ 30వరకు పొడిగించాలని అన్నారు. సమావేశంలో మేడా హనుమంతరావు, గని, చైతన్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కళ్ళజోళ్ళు, టోపీలు అందజేత

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఎండల్లో వేసవి తాపానికి తట్టుకుని ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడానికి పోలీస్ అధికారులు, సిబ్బందికి టోపీలు, కళ్ళజోళ్ళు ఎంతో ఉపయోగపడతాయని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో గుంటూరు నగర ట్రాఫిక్ విభాగ పోలీస్ అధికారులు, సిబ్బందికి దాతల సహకారంతో సమ్మర్ టోపీలను, కళ్ళజోళ్ళను శుక్రవారం ఆయన అందించారు. ట్రాఫిక్ పోలీసులకు గ్రేటర్ వాసవి క్లబ్ తరపున చీతిరాల శేఖర్, కొత్తూరు అశోక్, గుంటూరు తరఫున సుమారు 200 టోపీలు, కళ్ళజోళ్ళు బహూకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొత్తూరు హేమంత్‌ని ఎస్పీ దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ దీక్ష, ట్రాఫిక్ డీఎస్పీతో పాటు ఈస్ట్ ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్ , వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ఎస్సైలు రవీంద్ర బాబు, ఇతర ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధనలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

● జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు (విద్య) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పరిశోధనలపై ఆసక్తి పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం ఉండాలని వేదిక వ్యవస్థాపక కార్యదర్శి లక్ష్మణ్‌రెడ్డి సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు జేవీవీ నాయకులు బి.ప్రసాద్, టిఆర్ రమేష్, అక్బర్, ఎస్ఎం సుభాని, రామ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

వేణుగోపాలరావు సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), మార్చి 28(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అనేక సహకారాలు అందించిన కాకతీయ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ స్థాపనలో ఒకరైన పుట్టగుంట వేణుగోపాలరావు సేవలు స్ఫూర్తిదాయకమని కమ్మజనసేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అన్నారు. స్థానిక కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శుక్రవారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీలో ఉన్న విద్యార్థులతో పాటు వసతి గృహంలో పేద విద్యార్థినులకు ప్రతి ఏడాది ఉపకార వేతనాలు అందజేసారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, వడ్లమూడి నాగేంద్రం, మర్రిపూడి సీతారామయ్య, గోరంట్ల పున్నయ్య చౌదరి, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

టీజేపీఎస్ విద్యార్థినికి సేవా పురస్కారం

గుంటూరు (విద్య), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాల విద్యార్థిని పి.స్వాతికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డును అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ అనితదేవి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినిని కళాశాల కార్యదర్శి కె.వి బ్రహ్మం తదితరులు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి కొత్తపేట కృష్ణమహల్ ఎదురుగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు కొత్తపేట పోలీసులకి సమాచారం ఇవ్వగా పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్ స్టేషన్ 08632221815, సీఐ వీరయ్య చౌదరికి 8688831320లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

మానసిక సమస్యలకు పరిష్కారం చూపాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు (విద్య) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : యువత మానసిక సమస్యలకు పరిష్కారం చూపి వారిని చైతన్యవంతం చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సూచించారు. సాంబశివపేటలోని సెయింట్ జోసెఫ్ బీఈడీ కళాశాలలో శుక్రవారం సైకో సోషల్ కాంపిటెన్సీ ఫర్ గ్లోబల్ యూత్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అనేక మానసిక సమస్యలకు లోనవుతున్నారని, వారికి సరైన కౌన్సెలింగ్ ఇచ్చి సన్మార్గంలో పయనించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌యూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య బ్రహ్మాజీ, జేఎంజే ప్రతినిధులు విజయ మేరీ, కళాశాల కార్యదర్శి తేరీసమ్మ, ప్రిన్సిపాల్ ఈ.స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో టీడీపీ నాయకుడు తిరివీధి హరికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ-20 నాకౌట్ టోర్నమెంట్ సీజన్-2 ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేసారు. ఆమె మాట్లాడుతూ ఈ ఒత్తిడి జీవితంలో ప్రతి ఒక్కరు సతమతం అవుతున్నారని, వారంలో ఒక రోజు ఖచ్చితంగా క్రీడలకు కేటాయిస్తే మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతామని తెలిపారు.

ఎన్నికలంటే వణికిపోతున్న వైసీపీ : కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికలంటే వణికిపోతున్న వైసీపీ వచ్చే ఎన్నికల వరకు బతికి బట్టగట్టే పరిస్థితి లేదని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమిని ముందే ఒప్పుకొని స్వచ్ఛందంగా మేయర్ పదవికి రాజీనామా చేసిన వైసీపీ నేతలకు టీడీపీ నాయకులను విమర్శించే అర్హత లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడి గెలిచిందని మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. రేపల్లె, సత్తెనపల్లి ప్రజలు తన్ని తరిమేస్తే గుంటూరుకి వచ్చిపడ్డ అంబటి నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఎన్ని గేట్లుంటాయో కూడా తెలియని అసమర్థుడు అంబటి అన్నారు. అంతరించిపోయిన ప్రాంతీయ పార్టీల జాబితాలోకి వైసీపీ చేరడం ఖాయమని కనపర్తి అన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ వేడుకలు : కంచర్ల

గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ వేడుకలు ఈనెల 29న అరండల్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్ళు అనే సిద్ధాంతంతో పని చేసిన తెలుగుదేశం పార్టీ, పేదవాడికి కూడు, గూడు, గుడ్డ, ఉపాధి కల్పించడమే ఆశయంగా ముందుకు సాగిందని ఆయన గుర్తు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, జిల్లాలోని ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, బూర్ల రామాంజనేయులు, మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలనువిజయవంతం చేయాలన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

● బ్రాహ్మణ చైతన్య వేదిక విజ్ఞప్తి

గుంటూరు సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ రాజమండ్రిలో అనుమానాస్పద మృతిపై పోలీస్ శాఖ కఠినంగా విచారణ చేపట్టాలని, కుట్ర కోణం దాగుంటే దోషులు ఎంతటి వారైనా సరే శిక్షలు పడేలా కేసు నమోదు చేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం శ్రీధర్ మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై కుట్ర కోణం ఏమైనా దాగుందా అని రాష్ట్ర ప్రజలు, క్రిస్టియన్ సమాజం చర్చ జరుగుతున్న సమయంలో హోం శాఖ మంత్రి అనిత వెంటనే స్పందించి కేసు నమోదు చేయించి డీఎస్పీ స్థాయి ఉన్నతాధికారిని విచారణ చేపట్టేందుకు నియమించటం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపైన సమగ్ర విచారణ చేయమని ప్రకటన చేయడం మంచి పరిణామమని, అధికార దాహంతో రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు అన్నదమ్ముల్లాగా కలిసి ఉండే సమాజంలో, రాష్ట్రంలో మత ఘర్షణలు సృష్టించేందు కోసం ఏమైనా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడ్డారేమోనని అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నారు.

30న పాస్టర్ ప్రవీణ్ శాంతి రుధిర యాత్ర

గుంటూరు(తూర్పు), మార్చి 28(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సేవకుడు పాస్టర్ ప్రవీణ్ పగాడాల ఆత్మకు శాంతి చేకూరేలా క్రైస్తవ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 30న శాంతి రుధిర యాత్ర నిర్వహిస్తున్నట్టు క్రైస్తవ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల రాజు తెలిపారు. స్థానిక మిర్చి యార్డు సమీపంలో ఆదరణకర్త మినిస్ట్రీస్‌లో శుక్రవారం క్రైస్తవ, మైనార్టీ సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రుధిర యాత్ర ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు లాడ్జి సెంటర్ నుంచి ప్రారంభమై నగరంపాలెం ఎస్పీ కార్యాలయం వరకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ జోసఫ్, రాంబాబు, విల్సన్, విద్యాసాగర్, ప్రేమ్ జ్యోతిబాబు, నల్లపు నీలంబరం, రవికిరణ్, లీలా తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తదితరులు

వైభవంగా ఉగాది పురస్కారాలు ప్రదానం

గుంటూరు(తూర్పు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో పలు రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా జిలా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్ బీజీ పార్థసారథి, నాలుగవ జిల్లా కోర్టు జడ్జి ఆర్.శరత్ బాబు, ఏపీ సెక్రటేరియట్ అదనపు కార్యదర్శి లా డిపార్ట్‌మెంట్ డాక్టర్ లంకా లక్ష్మీనారాయణ, అజో విభో ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తదితరులు పాల్గొని పురస్కార గ్రహీతలు సాహిత్యంలో వెలువోలు నాగరాజ్యలక్ష్మి, వట్టి జొన్నల బ్రహ్మం, విద్యారంగంలో మేకల మోహనరావు, వైద్యరంగంలో డాక్టర్ బండ్ల రామ్‌చాంద్, నాటక రంగంలో బొర్రా నరసయ్య, కూచిపూడి నృత్యంలో వడ్డమాను రంగమణి, సంగీతంలో రామరాజు ప్రేమ్ కుమార్, కళారంగంలో బండారు నాగమణి, చెరుకూరి సాంబశివరావులకు ఉగాది పురస్కారంతో సత్కరించి ప్రశంసించారు. సభానంతరం శ్రీకృష్ణ థియేటర్ ఢిల్లీ వారిచే బర్రె సత్యనారాయణ రచించిన, ఢిల్లీ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన అనశ్వరం నాటిక సందేశాత్మకంగా సాగింది. కార్యక్రమాలను బొప్పన్న నారసింహారావు డి.తిరుమలేశ్వరరావు, కాట్రగడ్డ రామకృష్ణ పర్యవేక్షించారు.

13 నుంచి నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్, రీడింగ్ రూమ్ కొరిటెపాడు గుంటూరు వేదికగా గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి వైకే నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 52 సంవత్సరాల కళారంగ ప్రస్థానంతో డాక్టర్ మాగంటి మురళీమోహనరావు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, అన్నమయ్య కళావేదికపై జిలా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్ బీజీ పార్థసారథి, నాలుగవ జిల్లా జడ్జీ ఆర్ శరత్ బాబు, ఏపీ సెక్రటేరియట్ అదనపు కార్యదర్శి లా డిపార్మెంట్, డాక్టర్ లంకా లక్ష్మీ నారాయణ, అజో విభో ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ, మేకల మోహనరావు తదితరులు పాల్గొని కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ప్రతిభకు పురస్కారాలే ప్రోత్సాహకాలు

● సీజీఎస్‌టీ కమిషనర్ నరసింహారెడ్డికి ఉగాది పురస్కారం

గుంటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా విశిష్ట వ్యక్తులకు, కళాకారులకు పురస్కారాలు అందచేస్తున్న గుంటూరులోని ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఈవీవీ యువ కళావాహిని ఈ యేడాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి (ఐఆర్ఎస్)కి అందచేసారు. బ్రాడిపేటలోని ఓ హోటల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కమిషనర్ నరసింహారెడ్డిని ఉగాది విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉగాది పురస్కారం వ్యక్తిత్వానికి, నిబద్ధతకు సూచిక అని, ఇది మరింత బాధ్యతగా తమ ఉద్యోగంలో ముందుకు సాగటానికి దిక్సూచిగా పని చేస్తుందన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమిషనర్ నరసింహారెడ్డి ఉద్యోగ విధులతో పాటు, సామాజిక సేవకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ రంగంలో చూపిన అసాధారణ ప్రతిభ, సామాజికసేవా రంగాలలో చేసిన కృషికి గుర్తింపుగా కమిషనర్ నరసింహారెడ్డికి తెలుగు ఉగాది పురస్కారాన్ని అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళావాహిని సభ్యులు టీఎల్‌వీ వీరాంజనేయులు, ఊటుకూరు సుబ్బారావు, షరాబు కృష్ణ, ఏల్చూరి సత్యనారాయణ, చిట్టిప్రోలు రఘు, పి.కిరణ్, గార్లపాటి సత్యనారాయణ, సీజీఎస్‌టీ అధికారులు మధుసూదనరెడ్డి, లక్ష్మీనారాయణ, వి.వెంకటేశ్వరరావు, ఎం.నాగరాజు, రవి కుమార్, చీదెళ్ళ ఈశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి, చిట్టే వెంకటేశ్వరరావు, కాకర్ల, పూర్ణసాయి తదితరులు పాల్గొన్నారు.



నరసింహారెడ్డికి ఉగాది పురస్కారం అందజేస్తున్న యేల్చూరి వెంకటేశ్వర్లు వెచ్చా కృష్ణమూర్తి తదితరులు

పీ 4 కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నాం

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు

గుంటూరు(తూర్పు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా పేదల సంక్షేమం కోసం తలపెట్టిన పీ 4 కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు అన్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ప్రజా సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమించి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పీ4 లో భాగంగా ఉపాధి అవకాశాలు చూపించాలని విజ్ఞప్తి చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. నగరంలో క్రైస్తవులకు శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, గంగోలు శామ్యూల్, ఈశ్రి రాజశేఖర్, డి.సురేష్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజుబుల్ పోలీసింగ్

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సీఐ గంగా వెంకటేశ్వర్లు విజుబుల్ పోలీసింగ్ నిర్వహించారు. గుజ్జనగుండ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో కలసి ఆయన నడుస్తూ రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను, తోపుడు బండ్లను క్రమబద్ధీకరించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ముఖ్యంగా నేరస్తుల కదలికలను కట్టడి చేయడంతో పాటు ప్రజల్లో భరోసా కల్పించేందుకే విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

శ్రీనగర్ 6వ లైనుకి చెందిన రోసిల్లా శ్రీలక్ష్మికి, నక్కా శ్రీనివాసరావుకు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక పాప, ఒక బాబు సంతానం ఉన్నారు. వారిద్దరూ రైల్వే డిపార్టుమెంట్‌లో పని చేస్తుంటారు. నాలుగు సంవత్సరాలుగా నక్కా శ్రీనివాసరావు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్య శ్రీలక్ష్మిని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. శ్రీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణులు.. కనువిందు



నీళ్లు తాగుతున్న చుక్కల జింకలు

వినుకొండటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వినుకొండ సమీపంలోని కండ్రిక బీటు అటవీ ప్రాంతంలో జంతువులు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి సిద్ధంగా ఉన్న నీటి కుంట వద్ద దర్శనమిస్తున్న అడవి జంతువులను చూస్తే ఆశ్చర్యం కలిగించక మానదు. అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్‌వో 20 రోజుల క్రితం కండ్రిక బీట్‌లోని నీటి కుంటల వద్ద సీసీ కెమెరాలు అమర్చారు. 27న సీసీ పుటేజీలను పరిశీలించిన అధికారులకు, కణితి, మనబోతు, చుక్కల దుప్పులు, అడవి పందులు, అడవి కుక్కలు, నెమళ్లతో పాటు వివిధ రకాల పక్షుల వీడియోలు రికార్డు అయ్యాయి.



పురివిప్పి నాట్యమాడుతున్న నెమలి



మనబోతుతో ఉన్న పిల్లలు





రేస్ కుక్క

పేలుళ్ల ధాటికి.. ఇళ్లు కూలుతున్నాయ్

దుమ్ముతో పంట పాడవుతోంది.. సిమెంటు కంపెనీలపై ప్రజల ఆగ్రహం



మిరప కాయల పై పడిన దుమ్మును పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, ఇతర అధికారులు

దాచేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్టరీకి భూములు ఇస్తే మీ పిల్లలకు ఉద్యోగాలొస్తాయి...మీ గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది...వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం...తాగు నీటి సమస్య లేకుండా చూస్తాం...అంటూ ప్రజాభిప్రాయ సేకరణలో ఫ్యాక్టరీ యజమానులు అధికారుల ఎదుట గ్రామస్తులకు హామీలు ఇచ్చారు. తీరా ఫ్యాక్టరీ నిర్మాణాలు పూర్తి చేసుకొని ఉత్పత్తులు ప్రారంభించారు. కాని మా పిల్లల ఉద్యోగాల మాట దేవుడెరుగు, మాకు పట్టెడన్నం పెట్టే పంట పొలాలు సిమెంట్ ఫ్యాక్టరీ దుమ్ముధూళితో దెబ్బతింటున్నాయి. మాకు నిలువ నీడనిచ్చే ఇళ్ళు నేల మట్టమయ్యే పరిస్థితి వచ్చింది. మా పంట పొలాలకు సాగు నీరు అందించే కాలువలను పూడ్చి వేశారు. ఇదేమిటని? అడిగితే మా ప్రశ్నలకు బదులు ఇచ్చే వారే కరువయ్యారంటూ తమ గ్రామాలకు వచ్చిన అధికారులకు ప్రజలు గోడు వెళ్ళబుచ్చుకున్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని చెట్టినాడు సిమెంట్స్, తంగెడ గ్రామంలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలను అధికారులు పరిశీలించారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ పర్యవేక్షణలో హౌసింగ్, మైనింగ్, నీటి పారుదల శాఖ, మైనర్ ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, దేవాదాయ శాఖ, మరికొన్ని ఇతర శాఖలతో కలిపి 11 శాఖల అధికారులు తక్కెళ్ళపాడు, పెదగార్లపాడు, తంగెడ గ్రామాల్లోని రైతులను, బ్లాస్టింగ్‌తో ఇళ్ళు దెబ్బతిన్న బాధిత కుటుంబాలను నేరుగా కలసి వారి కష్టాలను విన్నారు. రైతులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము పంట పొలాల పై పడటంతో చెట్లు ఎదుగుదల తగ్గటం, పండిన కాయల పై దుమ్ము పేరక పోయి నాణ్య లేక పోవటం, నాణ్యత లేని పంటకు ధర లేక పోవటం, తమను ఆర్థికంగా కుంగ దీస్తుందన్నారు. ఇది చాలదన్నంటూ పెద్ద మొత్తంలో పేలుళ్ళు జరపటంతో నివాస గృహాల గోడలు పగుళ్ళిచ్చి స్లాబులు దెబ్బతిని ఇళ్ళు కూలిపోయే పరిస్థితి ఉందని కోరంపల్లి ధనలక్ష్మి, షేక్ గుంటూరు, సోయ యలమందమ్మ, సిద్దాబత్తుల శ్రీను ఆర్డీవోకు కన్నీటి పర్యంతమవుతూ వివరించారు. గత మూడు సంవత్సరాలుగా తాము పడుతున్న బాధలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు, ఎంపీ కృష్ణ దేవరాయలకు తెలియ జేశామని తెలిపారు. అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని మా వంక చూసిన దాఖలాలు లేవని తెలిపారు. ఫ్యాక్టరీలకు భూములు ఇవ్వటమే మేము చేసిన నేరమా? అంటూ వారు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోయినా పర్వాలేదు గాని మాకు నీడనిచ్చే ఇళ్ళను, మాకు పట్టెడన్నం పెట్టే పొలాలను నాశనం చేయవద్దని వారు వేడుకున్నారు. అనంతరం నీటి పారుదల శాఖకు చెందిన కాలువలు ఆక్రమించటం, తక్కెళ్ళపాడు గ్రామ పంచాయతీకి గత ఐదు సంవత్సరాలుగా రూ 70 లక్షలు పన్నులు చెల్లించక పోవటం, అనుమతులు లేకుండా క్రషర్ నిర్మాణం, స్టాకర్ షెడ్డు నిర్మాణాలను కూడా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తెలిపిన వివరాలను క్షేత్ర స్థాయిలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను నమోదు చేశామని, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మైనింగ్ ఏడీ ప్రకాష్ కుమార్, హౌసింగ్ ఈఈ బాలాజీ నాయక్, మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, నీటి పారుదల శాఖ డీఈ పసుపులేటి ఆదినారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు, దేవాదాయ శాఖ ఈవో నెమలిరెడ్డి, సీఐ భాస్కరరావు, ఎస్ఐ సౌదర్ రాజన్, టీడీపీ నేతలు పురంశెట్టి పరంజ్యోతి, రామారావు, జనసేన నేతలు అంబటి మల్లి, బూసి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి అంకారావు, తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ, జనసేన మండల కన్వీనర్ పాముల కిషోర్, ఆవుల శివకృష్ణ, కిష్టంశెట్టి పకీరయ్య, ఉలిబండ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



పెదగార్లపాడు గ్రామంలో భారీ బ్లాస్టింగ్‌కు పగుళ్ళిచ్చిన ఇంటి గోడలను పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు

కొత్త చరిత్రకు వేదిక

- పేదరిక నిర్మూలనకు వినూత్నంగా పీ4 కార్యక్రమం
- రాష్ట్రంలోని పేదలకు సంపన్నుల చేయూత
- ఇరువురికి మధ్య అనుసంధానంగా ప్రభుత్వం
- ఉగాది వేడుకల్లోనే పీ4కు సీఎం శ్రీకారం
- వెలగపూడిలో కొలిక్కి వచ్చిన సభ ఏర్పాట్లు
- 11 వేల మందికిపైగా కూర్చుని వీక్షించేలా ఏర్పాట్లు
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులు



వెలగపూడిలో ముస్తాబైన సభాప్రాంగణం

మంగళగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలకు రాజధాని ప్రాంతంలోని వెలగపూడి ముస్తాబైంది. ఈ వేడుకలకు తోడు రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించే సరికొత్త విధానం పీ4కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ రెండింటిని కలిపి ఒకే ఉత్సవంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయి. రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి 2047 నాటికి స్వర్ణాంధ్రను సాకారం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానానికి రూపకల్పన చేశారు. రాష్ట్ర సామాజిక గతిని మలుపుతిప్పే ఈ చరిత్రాత్మక కార్యక్రమాన్ని ఆదివారం సీఎం ప్రారంభిస్తున్నారు. ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని అమలుచేయనున్నారు. ఈ విధానంలో ప్రభుత్వం ప్రత్యేకంగా పేదవారికి ఎలాంటి రుణాలు, నిధులు ఇవ్వదు. కానీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సంపన్న కుటుంబాలు రాష్ట్రంలో వెనుకబడిఉన్న పేద కుటుంబాలను ఆదుకొనేలాగా, తద్వారా సామాజికంగా మార్పు తీసుకొచ్చేలాగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇందులో దాతలను మార్గదర్శులుగా, లబ్ధిదారులను బంగారు కుటుంబాలుగా పిలుస్తారు. ఈ ఇరువురి మధ్య ప్రభుత్వం ఓ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. దీనికోసం పీ4 సొసైటీలను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేస్తారు. పేదరికం లేని రాష్ట్రం కోసం ఇదో విప్లవాత్మకమైన ముందడుగు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ విధానం దేశానికే ఓ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రత్యేకంగా వేదిక ముస్తాబు

వెలగపూడిలోని సెక్రటేరియెట్ వెనుకవైపు ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ప్రాంగణంలో ఉగాది, పీ4 కార్యక్రమం ప్రారంభ వేడుకలను 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకల్లా ప్రాంగణం వద్దకు చేరుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమాల నిర్వహణకు ప్రాంగణంలో రెండు షెడ్లు నిర్మించారు. ప్రధానమైన షెడ్డులో 11 వేలమందికిపైగా కూర్చొని కార్యక్రమాలను వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, రైతులు, ఉపాధి కూలీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. సమీప జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఏడు వేలమందిని, సుదూర జిల్లాల నుంచి సుమారు 5 వేలమందిని తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. దగ్గరి ప్రాంతం వారికి కూడా అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. సభా ప్రాంగణంలో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని పార్కింగ్ కోసం కేటాయించారు.



ప్రధాన వేదిక

బాపట్ల-చీరాల మధ్య.. టూరిజం సర్క్యూట్

- బ్లూఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక
- అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక కేంద్రం
- పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్



అడవిపల్లెపాలెంలో పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ప్రమాణాలతో సూర్యలంక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బాపట్ల మండలం అడవిపల్లెపాలెం వీ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌పార్క్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్లూఫాగ్‌బీచ్‌గా సూర్యలంక బీచ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. పర్యాటకుల భద్రత, అంతర్జాతీయప్రమాణాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. బాపట్ల-చీరాల మధ్యలో టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. కేంద్రప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 ద్వారా మంజూరైన 97.52 కోట్ల రూపాయల నిధులతో సూర్యలంకబీచ్‌లో అధునాతన సదుపాయాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే పీపీపీ విధానంలో పెట్టుబడులకు పలువురు ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలికామన్నారు. పీపీపీ విధానంలో వీ రిసార్ట్స్ ఏర్పాటు చేయటం సంతోషదాయకమన్నారు.

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో పర్యాటకరంగం అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందుకు నిదర్శనంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సూర్యలంకబీచ్‌కు 97కోట్లు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ నిధులతో సూర్యలంకబీచ్‌లో పర్యావరణ విద్య, పరిశుభ్రత, టాయిలెట్స్, బట్టలు మార్చుకునే గదులు, వ్యర్థాల నిర్వాహణకు విధానం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే పర్యాటకానికి పెద్దపీట వేస్తామన్నారు. తద్వారా బాపట్ల-చీరాల నియోజకవర్గాలలో భారీఎత్తున ఉపాధి కల్పించనున్నామన్నారు. పర్యాటక రంగానికి ఈ ప్రాంతాలు ఉపయోగపడేవని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో బాపట్ల,చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండలు తెలిపినట్లు చెప్పారు. వాళ్ళుఅడిగిన 15రోజుల్లోనే సూర్యలంకబీచ్ అభివృద్ధికి భారీఎత్తున నిధులు రావటం జరిగిందన్నారు. ఇందుకు కేంద్రగ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇతోధికంగా కృషి చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య, బాపట్లఅర్బన్ డెవలప్‌మెంట్ అధారటి ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, జనసేన సీనియర్ నాయకులు అమంచి స్వాములు, నామన వెంకటశివన్నారాయణ, వీ రిసార్ట్స్ అధినేత సందీప్, భాస్కర్ పాల్గొన్నారు.

రేపు సాహితీ వసంతోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని సాహితీ సమైక్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30న ఆదివారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు సమైఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవి, గజల్ రచయిత రసరాజుకు సాహితీ పురస్కారం, ప్రముఖ సినీ నటుడు కేదార్‌శంకరకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాంగ శ్రవణం, విష్ణు సహస్రనామ పారాయణం, సాహితీ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎమ్‌టీ కృష్ణబాబు,కమిషనర్ శ్రీనివాసులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రామచంద్ర రాజు, సమైఖ్య కార్యదర్శి రాము పాల్గొన్నారు.

బెల్ సరే.. మరి నీళ్ళెలా..?

(3వ పేజీ తరువాయి)

కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మరికొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల బయట దొరికే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. పాఠశాలల్లో బోధన గురించి పక్కన పెడితే విద్యార్థులకు కనీస అవసరమైన నీటి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటినే వినియోగిస్తున్నారు. ఆ నీరు అయిపోతే విద్యార్థులు బయటకు వెళ్లి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. లేదంటే ఇంటికి వెళ్లే వరకు దాహార్తితో అల్లాడిపోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఉదయం 10, 11, 12 గంటలకు వాటర్ బెల్‌ను ఎలా అమలు చేయాలని ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

రూ.లక్షలతో ఏర్పాటు.. ఫలితం శూన్యం

2020లో నాడు-నేడు పథకంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేశారు. ఒక్కో వాటర్ ప్లాంట్ 50,000 లీటర్లు లక్ష, 2 లక్షలు లీటర్ల సామర్థ్యంతో కొనుగోలు చేశారు. సరఫరా, బిగించడం, నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షల నుంచి రూ5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. అయితే ఏజెన్సీలు అనేక చోట్ల ప్లాంట్లు పంపిణీ చేసి వాటిని బిగించలేదు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం చేయకుండానే యంత్రాలను తీసుకు వచ్చి పాఠశాలల్లో పెట్టారు. తర్వాత షెడ్డు నిర్మించినా వాటిని బిగించకుండా మూలన పడేశారు. మరి కొన్ని చోట్ల నిర్వహణా లోపంతో వాడుకలోనికి తీసుకురాలేదు. ఫలితంగా పాఠశాలల్లో శుద్ధ జల యంత్రాలు ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. మరమ్మతులపై పాఠశాలల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం తాజాగా ఆర్వో ప్లాంట్ల విషయాన్ని తెలుసుకుని స్కూల్ గ్రాంట్ నిధులను విడుదల చేయడంతో కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పాఠశాలల్లో మాత్రం పరిస్థితి షరామామూలుగానే ఉంది.





రేపల్లె 3వ వార్డులోని మున్సిపల్ హైస్కూల్లో పనిచెయ్యని ఆర్‌వోప్లాంట్, పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో ఇంటి నుండి బాటిల్స్ తెచ్చుకుంటున్న బాలికలు

ఆర్-5 జోన్ లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు

గుంటూరులో 216 ఎకరాలు

ఎన్టీఆర్ జిల్లాలో 80 ఎకరాలు గుర్తింపు

7056 మంది అనర్హుల గుర్తింపు



గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో ఆర్5 జోన్ ఒకటి ఏర్పాటు చేసి లబ్ధిదారులు, భూములు ఇచ్చిన రైతుల మధ్యన వైసీపీ కుంపటి పెట్టగా ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం సిద్ధమైంది. తాము అధికారంలోకి రాగానే ఆర్5 జోన్‌ని రద్దు చేయడంతో పాటు లబ్ధిదారులకు స్థానికంగా నివాసం ఉంటున్న సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రతిపక్షంలో ఉండగా సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆ మేరకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లను భూములను గుర్తించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ఇప్పటికే గుంటూరు జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అవసరమైన భూములను గుర్తించారు. ఎన్టీఆర్ జిల్లాలోనే పెండింగ్‌లో ఉండటంతో తక్షణమే ఇళ్ల స్థలాలకు అవసరమైన భూములను గుర్తించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధానికి వెలుపల ఉన్న నియోజకవర్గాల్లో ఇళ్ల స్థలాల కోసం పేదలను ఎంపిక చేశారు. అయితే వాళ్లకి స్థానికంగానే ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించి రాజధానిలో వేర్వేరు గ్రామాల్లో సెంటు భూములను ఇచ్చేందుకు ఆర్5 జోన్‌ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం వెంకటపాలెంలో సభ కూడా నిర్వహించారు. ఆగమేఘాలపై లేఅవుట్ల అభివృద్ధి పేరుతో రూ. వందల కోట్లు ఖర్చు చేశారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు కూడా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే దీనిని కోర్టులు నిలిపేశాయి. ఎన్టీఆర్ జిల్లాలో 27,031 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అలానే గుంటూరులో 23,761 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి హడావిడిగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన ఈ కుట్రని అప్పట్లోనే రాజధానికి భూములు ఇచ్చిన రైతులు వ్యతిరేకించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరినా అప్పటి వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది.

టీడీపీ ప్రభుత్వం గత ఏడాది అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 50,792 మంది లబ్ధిదారుల అర్హతలను పునర్‌పరిశీలన చేయించింది. గుంటూరులో 23,761 మందిలో 4,323(11 డ్యూప్లికేట్‌లు కలిపి) అనర్హులుగా తేల్చారు. ఎన్టీఆర్ జిల్లాలో 27,031 మంది లబ్ధిదారులకు 3,183 మంది అనర్హులుగా నిర్ధారించారు. అనర్హుల పేర్లను తొలగించిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలోని 23,848 మంది లబ్ధిదారులకు 265 ఎకరాల భూమి అవసరం అవుతుందని లెక్కించారు. అలానే గుంటూరు జిల్లాలో అనర్హుల ఏరివేత అనంతరం 19,438 మందికి 216 ఎకరాల భూమి అవసరమని నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే గుంటూరు జిల్లాలో లబ్ధిదారులకు అవసరమైన భూములను వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే గుర్తించారు. ఎన్టీ ఆర్ జిల్లాలో 265 ఎకరాలకు కేవలం 80 ఎకరాలు మాత్రమే గుర్తించారు. ఇంకా 185 ఎకరాలు ఎన్టీఆర్ జిల్లాలో గుర్తించాల్సి ఉన్నది. గుర్తించిన భూములను త్వరలోనే సేకరించి లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్లను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది.

పుల్లడిగుంటలో ఉప్పుటూరి ఇఫ్తార్

వట్టిచెరుకూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : హిందూ ముస్లిం ఐక్యత చాటుతూ మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో ఉప్పుటూరి చిన్నరాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు జరిగింది. రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఉప్పుటూరు చిన్న రాములు మాట్లాడుతూ కుల మతాలను పక్కన పెట్టి అందరూ మానవత్వంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరి మతాన్ని ప్రతి ఒక్కరూ అభిమతంగా మార్చుకుని గౌరవించుకుంటే విభేదాలు లేకుండా అందరూ కలిసి జీవనం సాగించవచ్చన్నారు, ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఉప్పుటూరి సీతామాలక్ష్మి చిన్నరాములు కుమారుడు రామ్‌చౌదరికి కృతజ్ఞతలు తెలుపుతూ దీవెనలు అందజేశారు.

ఉద్యోగ నియామకాల్లో నిర్లక్ష్యం

మంగళగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో ఉద్యోగ నియామకాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఏపీ సీఎల్‌సీ జిల్లా సహాయ కార్యదర్శి జీ.గోపీనాథ్, ఎస్‌కే నాగుర్‌వలి ప్రకటనలో విమర్శించారు. కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30వ తేదీన మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

323 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్‌కమిటీ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 323 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,200, గరిష్టధర రూ.10,600, మోడల్‌ధర రూ.10,350 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,200, గరిష్టధర రూ.10,600 మోడల్‌ధర రూ.10,300 పలికాయి.

విద్యుత్‌చార్జీల భారం మోపే యోచనను విరమించుకోవాలి

దుగ్గిరాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా శుక్రవారం నిర్వహించారు. విద్యుత్‌సర్‌చార్జిలు, ట్రూఅప్‌చార్జీలు, అదనపు లోడు చార్జీలను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాల్లో భాగంగా దుగ్గిరాలలోని సబ్‌స్టేషన్ ఎదుట జరిపిన ధర్నాలో మండల సీపీఎం కార్యదర్శి జెట్టి బాలరాజు, ఏమినేని స్టాలిన్, యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణబిల్లు ఆమోదిస్తే ముస్లిం ధార్మికసంస్థలకు నష్టం

దుగ్గిరాల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకురానున్న వక్ఫ్ సవరణబిల్లును చట్టసభల్లో ఆమోదిస్తే ముస్లిం ధార్మికసంస్థలకు తీరని నష్టం జరుగుతుందని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని అన్నారు. స్థానిక ముర్తుజానగర్‌లో శుక్రవారం మీడియాసమావేశంలో సుభాని మాట్లాడుతూ, వక్ఫ్‌సవరణబిల్లుతో ముస్లిం దర్గాలు, ఈద్గాలు, మదరసాలు స్వతంత్రతను కోల్పోతాయన్నారు. మార్చి 29న విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టనున్న నిరసనలో పాల్గొనాలని కోరారు.

శాస్త్రోక్తంగా శ్రీరామ పట్టాభిషేకం

మంగళగిరి సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరామ పట్టాభిషేకం ఘట్టాన్ని ప్రదర్శించారు. దేవస్థానం అర్చకులు ఈ ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవానికి గుంటూరుకు చెందిన మురళీసాయి సోదరులు కైంకర్యపరులుగాను, మంగళగిరికి చెందిన యేనుగ కిషోర్ ఆస్థాన కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నులకపేటలో స్వచ్ఛ మంగళగిరి

తాడేపల్లి టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో శుక్రవారం స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమాన్ని నిర్వహించారు. నులకపేట ప్రభుత్వ పాఠశాలలో పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో మొక్కలునాటి పారిశుధ్య పనులు చేసి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో అన్నెం కుసుమ, సాగర్, నిర్మల, జుంజు మరియదాసు, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

30న చైతన్య తపోవన్‌లో ఉగాది వేడుకలు

ఈ నెల 30న తాడేపల్లి పట్టణ నులకపేటలోని చైతన్య తపోవన్‌లో ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు మాతా శివచైతన్యానంద శుక్రవారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు మాతాజీ జన్మదిన వేడుకలు వేద స్వస్తి పంచాంగ శ్రవణం, అయోధ్యరాముని కోదండ ధనుర్బాణ సందర్శనం ఉంటుందని తెలిపారు.

నేడు కేఎల్‌యూలో జాతీయ స్థాయి ఈతపోటీలు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం జాతీయ స్థాయి ఈతపోటీలు నిర్వహిస్తున్నట్టు క్రీడల డైరెక్టర్ డాక్టర్ హరికిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. కేఎల్‌యూలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్‌లో ఈతలపోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీల నుండి విద్యార్థులు పాల్గొంటున్నట్టు తెలిపారు. 100 మీటర్ల ఫ్రీస్టైల్, బాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లై స్ట్రోక్, వంటి నాలుగు రకాల ఈత పోటీలతోపాటు ఫ్రీస్టైల్ రిలే 400 మీటర్లు, ఈతపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం 8.30 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు గ్రామంలోని ముస్లింలకు శుక్రవారం తెల్లవారు జామున విందు ఏర్పాటుచేశారు. సుమారు 1000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ పంపిన నూతన వస్త్రాలను ఇమాం, మౌజన్‌లకు కాట్రగడ్డ మధు, నియోజకవర్గ టిడిపి పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు ఈపూరి కోటయ్య, సుబ్రహ్మణ్యం, నాగూర్‌వలి, నాగూర్, కత్తిక శ్రీరాములు, అన్వర్ బాషా, అబ్దుల్ గఫూర్, కంచర్ల కోటేశ్వరరావు, భీముడు, రాధారంగా నగర్, ఇమాంలు, మౌజన్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర వైసీపీ ఎస్సీ విభాగ ప్రధానకార్యదర్శిగా ముదిగొండ

తాడేపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం తాడేపల్లికి చెందిన ముదిగొండ ప్రకాష్‌ను రాష్ట్ర వైసీపీ ఎస్సీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

మూడు వేలమందికి పట్టాల పంపిణీ

- ఇది తొలి విడత మాత్రమే
- మలి విడతలో మరింతమందికి
- హామీల అమలులో లోకేశ్ ముందంజ



తాడేపల్లి తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం అర్ధరాత్రి కూడా నివేశన పట్టాలను తయారుచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మంగళగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన అన్నీ రకాల హామీల అమలుకు మంత్రి నారా లోకేశ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఎన్నికల ముందర లోకేశ్ నియోజకవర్గంలో వివిధ రకాల ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నివాసం వుంటున్న అందరికీ దశలవారీగా నివేశన పట్టాలను పంపిణీ చేయిస్తానంటూ ఇచ్చిన హామీని ఇపుడు అమల్లో పెడుతున్నారు. ఈ క్రమంలో తొలి విడతగా నియోజకవర్గంలో సుమారు మూడు వేల మందికి నివేశన పట్టాలను పంపిణీ చేసేందుకుగాను రంగం సిద్ధం చేశారు. వీరికి ఏప్రిల్ మూడవ తేదీనుంచి పట్టాలను పంపిణీ చేసేందుకు చర్యలను తీసుకుంటున్నారు. తాడేపల్లి ఏరియాలో రెండు వేల మందికి, మంగళగిరి ప్రాంతంలో సుమారు వేయిమందికి ఈ పట్టాలను పంపిణీ చేయబోతున్నారు. దీనికి సంబంధించి రెండు మండల తహసీల్దారు కార్యాలయాలలో రెవెన్యూ అధికారులు సంబంధిత పట్టాల తయారీలో నిమగ్నమయ్యారు. తాడేపల్లిలో పంపిణీ చేయాల్సిన పట్టాల సంఖ్య ఒకింత ఎక్కువగా వుండడంతో ఆ మండల తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది కొద్ది రోజులుగా అర్ధరాత్రి 12 గంటల వరకు పనిచేస్తున్నారు. ప్రస్తుతం తొలిదశ కింద ఎటువంటి అభ్యంతరాలు లేనటువంటి ప్రభుత్వ పోరంబోకు భూములకు నివేశన పట్టాలను పంపిణీ చేయనున్నారు. అదికూడ 150 గజాల లోపు విస్తీర్ణం కలిగివున్న వారికి మాత్రమే! అంతకన్నా ఎక్కువ విస్తీర్ణంలో వుంటున్నవారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన నామమాత్రపు ధరలపై నివేశనపట్టాలను పంపిణీ చేసేలా ఓ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఉగాది పర్వదినం నాడు లాంఛనంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది.

గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా కృషిచేయాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మన్నవ స్వప్న

మేడికొండూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు ఐక్యంగా కృషి చేయాలని ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ ఎం.హరిబాబు మాట్లాడుతూ మండలంలో నిర్మించే అమరావతి ఓఆర్‌ఆర్‌తోపాటు అమరావతి నుంచి ఫిరంగిపురం వరకు నాలుగు లేన్ల రహదారికి రెండు నెలల్లో భూసేకరణ పూర్తిచేయాలని లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కొత్తగా వచ్చే రహదారుల కారణంగా ఈ ప్రాంతం బాగా అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. రీసర్వేలో వచ్చిన 700 దరఖాస్తులను పరిష్కరించామని చెప్పారు. అటవీశాఖ పరిధిలో పేరేచర్లలోని నగరవనం ప్రాంతంలో లక్ష 50 వేల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అటవీశాఖ అధికారి సంతోష్ తెలిపారు. నగరవనం పార్కులో ఉదయం ఐదున్నర నుంచి 8:30 గంటల మధ్య వాకింగ్ చేసేవారికి ఉచిత ఎంట్రీ ఉందన్నారు. ఏవో జె.వాసంతి మాట్లాడుతూ ప్రతి రైతు యూనిక్ ఐడీ నంబరు కోసం ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణశంకరరావు మాట్లాడుతూ రైతులు పొలాలలో నీటికుంటలుతీయించుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వప్న

సమస్యలు పరిష్కరించకపోతే రాజీనామా

సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని తాను రాజీనామా చేస్తానని సిరిపురం 1 ఎంపీటీసీ షేక్ అఫ్రోజ్, ఆమె భర్త పంచాయతీ వార్డు సభ్యుడు షేక్ రన్ను హుస్సేన్ సమావేశంలో అధికారులు ఎదుట తేల్చి చెప్పారు. గ్రామంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతంలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని, తమ వార్డులో పంట కాల్వపై కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెనను పునర్నిర్మించాలని నాలుగేళ్లుగా అడుగుతున్నా అధికారుల్లో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించలేనప్పుడు ఈ పదవులు ఎందుకని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో హామీ ఇచ్చారు.



కిరణ్‌చంద్‌ను అభినందిస్తున్న తెలుగుయువత

మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్‌గా కిరణ్‌చంద్

మంగళగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెదవడ్లపూడి గ్రామానికి చెందిన జవ్వాది కిరణ్‌చంద్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం 47 మార్కెట్ కమిటీలకు చైర్మన్లను ప్రకటించింది. ఈ జాబితాలో మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని కిరణ్‌చంద్ దక్కించుకున్నారు. కిరణ్‌చంద్ తొలినుంచి తెలుగుదేశం పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారు. విద్యార్థి దశ నుంచే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గతంలో తెలుగు యువత మండల కార్యదర్శిగా, రెండుమార్లు తెలుగు యువత మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగాను, టీడీపీ శాశ్వత సభ్యుడిగాను వున్నారు. మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కిరణ్‌చంద్ అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. పెదవడ్లపూడి గ్రామంలోని చిరువ్యాపారులకు తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, బడ్డీ కొట్లు, సెలూన్ చైర్లు, ఆర్థిక సాయం అందజేశారు. దాదాపు రూ.కోటిన్నర సొంత ఖర్చులతో మంగళగిరి మండలంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నుంచి పోటీ చేసిన నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీచేసిన పెమ్మసాని చంద్రశేఖర్ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. ముఖ్యంగా పెదవడ్లపూడిలో లోకేశ్‌కు మంచి మెజార్టీ రావడంలో కిరణ్‌చంద్ ముఖ్య భూమిక పోషించారు. ఎన్నికల ముందు లోకేశ్ యువగళం పాదయాత్ర విజయవంతం కావడంలో కూడా కిరణ్‌చంద్ ఎంతగానో శ్రమించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. కిరణ్‌చంద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల టీడీపీ నేతలు మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, తాడిబోయిన మహేష్ యాదవ్, కొత్తపల్లి శ్రీనివాసరావు తదితరులు హర్షం వెలిబుచ్చారు. పెదవడ్లపూడి గ్రామంలోను, మంగళగిరి టీడీపీ కార్యాలయంలోను మిఠాయిలు పంచి సంతోషం వ్యక్తం చేశారు.

నేడు మంగళగిరి బార్ అసోసియేషన్ ఎన్నికలు

మంగళగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది 2025-26 సంవత్సరానికి సంబంధించి మంగళగిరి బార్ అసోసియేషన్‌కు శనివారం ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల అధికారులు శ్రీభాష్యం రంగనాథ్, టి రోశయ్య, ఏ రామ్మోహనరెడ్డి తెలిపారు. అధ్యక్ష పదవికి దొడ్డక బ్రహ్మానందరావు, లంకా శివరామ్ ప్రసాద్, కొసనం శ్రీనివాసరావు, ఉపాధ్యక్ష పదవికి నవజీవన్ ప్రత్తిపాటి, నాయుడమ్మ బేతపూడి, ప్రధాన కార్యదర్శి పదవికి రమేష్ కురగంటి, శేఖర్‌బాబు కుడారి, జాయింట్ సెక్రటరీ పదవికి సూరబోయిన మురళీకృష్ణ, పాటిబండ్ల రమేష్, లైబ్రరీ సెక్రటరీ పదవికి ఈమని అశోక్‌కుమార్‌రెడ్డి, గుర్రం రామారావు, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి సింగంశెట్టి ఇందిరా ప్రియదర్శిని, నెమలికంటి రజని పోటీలో ఉన్నారని తెలిపారు. కాగా కోశాధికారి పదవికి తోట నరసింహరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి వి భారతి దేవి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వేమూరి రత్నప్రసాద్, నూతలపాటి నంబూద్రిపాద్, కూరపాటి మురళీరాజు, గుజ్జర్లపూడి జాన్‌బాబు, ఈసా శ్రీనివాసరావు, కూరపాటి అంబేద్కర్, మరో 13 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికలు ఉదయం 10.30 గంటల నుండి 3.30 గంటల వరకు జరుగుతాయని మొత్తం 155 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు.

ఇమామ్, మౌజన్లకు నూతన వస్త్రాలు

పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని మసీదుల్లో ఇమామ్, మౌజన్లకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పంపిన నూతన వస్త్రాలను శుక్రవారం కూటమి నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నీలం అంకారావు, ఫిరోజ్ ఖాన్, కర్నాటి శివసత్యనారాయణ, పాలకాయల శివనాగేశ్వరరావు, గడదాసు రంగారావు, జనసేన నేత లేళ్ల సాయినందన్, పావని పాల్గొన్నారు.

విద్యార్థిని కాపాడిన సిబ్బందికి అభినందన

మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుల్ సాగర్‌లు విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న క్రమంలో గుంటూరు నగర పరిధిలోని గడ్డిపాడు రైల్వేగేటు వద్ద ఇంజనీరింగ్ విద్యార్థి ఫణిదపు వెంకటరుషి ప్రాణాలను కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుల్ సాగర్‌ను ఘనంగా సన్మానించారు.

పరిహారం దరఖాస్తు గడువు పొడిగింపు

మంగళగిరి సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈ-శ్రమ గుర్తింపు కార్డు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, పూర్తి వైకల్యానికి గురైనా పరిహారం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు సహాయ కార్మికశాఖ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు కార్మికశాఖ అధికారుల పరిధిలోని పొన్నూరు, చుండూరు, తెనాలి, వట్టిచెరుకూరు, చేబ్రోలు, కొల్లిపర, దుగ్గిరాల, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ మండలాలకు చెందినవారు నమోదు చేసుకోవాలని సూచించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిడమర్రు గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాజధాని డివిజన్ కార్యదర్శి జే.నవీన్‌ప్రకాష్, కేవీపీఎస్, సీఐటీయూ నేతలు ఎం.రవి, ఎం.భాగ్యరాజ్, ఎం.అంకమ్మరావు, ఎమ్మెల మరియదాసు, కె.వీరయ్య ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నేతల నిరసన

తాడేపల్లి టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రజలపై కరెంటు చార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ నులకపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. పట్టణ సీపీఎం కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ మాట్లాడారు. నిరసనలో వై నేతాజీ, వేముల దుర్గారావు, కొట్టే కరుణాకర్, విజయబాబు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ఎస్‌ఆర్‌ఎంలో ప్రదర్శన

మంగళగిరి సిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణకు ప్రదర్శన నిర్వహించారు. దేశంలోని 58 యూనివర్సిటీలకు చెందిన 208మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌ఎం ఎన్విరాన్మెంట్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ఎగ్జిబిషన్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఎన్విరాన్మెంట్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రంగభాష్యం ప్రదర్శన ప్రాముఖ్యత, లక్ష్యాలను వివరించారు. ఎస్‌ఆర్‌ఎంలో జాతీయస్థాయిలో ఏర్పాటుచేసిన రెండో ఎగ్జిబిషన్‌కు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరుకావడంతో వారిని అభినందించారు. ప్రదర్శనకు వివిధ రాష్ట్రాల నుంచి 38 ఎగ్జిబిట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. పర్యావరణ స్థిరత్వానికి సంబంధించిన అంశాలతో రూపొందించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తమ ప్రదర్శనలుగా ఎంపికైనవాటికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం డీన్ డాక్టర్ టామీ, డాక్టర్ షోజీ, డాక్టర్ శుభశ్రీ పాల్గొన్నారు.



ఉత్తమ ప్రదర్శనలతో బహుమతులను సొంతం చేసుకున్న విద్యార్థులు

ఫార్మసీ రంగానికి ఎంతో ప్రాధాన్యం

ఏపీ ఏపీటీఏ సెక్రటరి డాక్టర్ వెంకటరమణ



మలినేని ఫార్మసీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏపీ ఏపీటీఏ సెక్రటరీ డాక్టర్ వెంకటరమణ తదితరులు

వట్టిచెరుకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పార్మసీ రంగానికి భవిష్యత్‌లో ఆదరణ పెరుగుతుందని ఏపీ ఏపీటీఏ సెక్రటరి డాక్టర్ కే వెంకటరమణ తెలిపారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కళాశాలలో టెక్నో కల్చరల్ అండ్ స్పోర్ట్స్ ఫేస్ట్ శుక్రవారం ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో పై కేర్ సొల్యూషన్ చైర్మన్ పీ శ్రీమన్నారాయణ, కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ జే కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ జీ సుధాకరరావు, డాక్టర్ జీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రాయపూడి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలని నిరసన

తుళ్లూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి) పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలంటూ రాయపూడి విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాబు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలన్నారు. టైం అప్‌డే విధానం రద్దు చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు మోపడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, జె.నవీన్ ప్రకాష్, టి.బక్కిరెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, గైరబోయిన నాగేశ్వరావు, షేక్ జానీ, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని రాజధాని గ్రామాల పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం.రవి మట్లాడుతూ ఉగాది పండగకి కూడా పెండింగ్ జీతాలు చెల్లించకుండా పస్తులుంచటం సరికాదన్నారు. రాష్ట్రమంతా రూ.21వేలు జీతం ఇస్తూ రాజధానిలో రూ.12వేలు ఇవ్వడం దారుణమన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నిరసన

ఫిరంగిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సెకీ ఒప్పందం రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉప సంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం అల్లవారిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, కే కోటేశ్వరరావు, గుంటుపల్లి వెంకటేశ్వరరావు, కొరిటాల శ్రీనివాసరావు, వై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరించాలని పలువురు స్థానికులు ఎంటిఎంసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిలో తమను పట్టి పీడిస్తున్న డ్రైనేజి వ్యవస్థ, మంచినీటి సరఫరా, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్ద ఎత్తున వివిధ అపార్టుమెంటు వాసులు పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ జొన్నవిత్తుల శేషయ్య అధ్యక్షతన తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో హైకోర్టు అడ్వొకేట్ యడవల్లి రమేష్, జొన్నవిత్తుల శేషయ్య, పిన్నమనేని మురళీకృష్ణ, వివిధ అపార్టుమెంటు వాసులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

మంగళగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థలో వివిధ కేడర్‌లలో పనిచేస్తున్న 14 వేల మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఏఐటీయూసీ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ సచివాలయంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ 2016 నుంచి గౌరవ వేతనం తీసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. నిరంతరం రైతులకు అందుబాటులో వుంటూ ప్రకృతి వ్యవసాయంలో రైతులను ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, రాష్ట్ర అధ్యక్షుడు ఎ.శ్రీధర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సభకు కోసం ఈ-8 రోడ్డు సిద్ధం

తుళ్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆదివారం నిర్వహిస్తున్న ఉగాది వేడుకలు, పీ-4 ప్రారంభోత్సవ సభకు ప్రజలు రావడానికి ఈ- 8 రోడ్డును ఏడీసీ అధికారులు సిద్ధం చేశారు. బస్సులు ఈ మార్గం గుండా వచ్చి ఇక్కడ సమీపంలో నిలుపుకొని తిరిగి ప్రయాణం సాగించేందుకు వీలుగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. శుక్రవారం ఏడీసీ ఎస్‌ఈ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, ఏఈ శివగంగాధర్, సాయి శరణ్ ఏర్పాట్లను పరిశీలించారు.

మానవుల్లో దైవత్వాన్ని నెలకొల్పుదాం

మండల పాస్టర్స్ ఫెలోషిప్ సంఘం

ఫిరంగిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మానవుల్లో దైవత్వాన్ని నెలకొల్పుదామని మండల పాస్టర్స్ ఫెలోషిప్ సంఘం పిలుపు నిచ్చింది. శుక్రవారం ఫిరంగిపురంలోని అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో పాస్టర్ పగడాల ప్రవీణ్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ రక్షణకు అందరి సహకారం అవసరమన్నారు. యనమాల సుందరరావు కవితలు ఆకట్టుకున్నాయి. సభలో పాస్టర్ల సంఘం అధ్యక్షులు జీ సాల్మన్ రాజు, షేక్ మదార్, పాస్టర్లు మద్దిబాల స్వామి, మేడా పురుషోత్తం, బోరుగడ్డ సాల్మన్ రాజు, ఉపాధ్యక్షుడు టీ ఆనందబాబు, జాన్‌బాబు పాల్గొన్నారు.

తుళ్లూరులో గంజాయి కలకలం

తుళ్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు ఓ ఇంటి వద్ద రెండు రోజులు క్రితం గంజాయి మత్తులో ఉన్న యుకులను యజమాని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రావడంతో ఇద్దరు యువకులు పరారైనట్టు తెలిసింది. ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్టు తెలిసింది. పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.

విదార్థుల సంఖ్య పెరగాలి

కాకుమాను, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ తెలిపారు. మండల పరిధిలోని అప్పాపురం ఎంపీపీ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని హెచ్‌ఎం వెంకటేశ్వరరావును ఆదేశించారు.కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారానికి చెన్నుపాటి శివనాగేశ్వరరావు

పెదనందిపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగానికి చెందిన చెన్నుపాటి శివనాగేశ్వరావు ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. సోమవారం గుంటూరు వెంకటేశ్వర దేవాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కళా దర్బార్ వారు నిర్వహించే వేడుకల్లో ఆయన పురస్కారం అందుకోనున్నారు.

ఇఫ్తార్‌లో బలసాని కిరణ్‌కుమార్

పెదనందిపాడు, మార్చి 28: పెదనందిపాడు జుమ్మా మసీదులో శుక్రవారం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఖాశింపీరా, సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివి రాంబాబు, షేక్ అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్‌ల ఏర్పాటు ఆపేయాలి

పెదనందిపాడు, మార్చి 28: స్మార్ట్ మీటర్లను ఆపేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని నాగులపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుగూ ఇప్పటికే ప్రజలు నిత్యావసరాల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతుంటే స్మార్ట్ మీటర్‌లను బిగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో దొప్పలపూడి రమేష్‌బాబు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, జయశంకర్‌రావు, షేక్ షమీ, లక్ష్మీ, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీఐ వాసుకు ప్రశంసాపత్రం

తాడికొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తాడికొండ సీఐ కే.వాసును శుక్రవారం ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు. ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష జరగ్గా కేసుల నమోదు చేసి సత్వరమే పరిష్కరించనందుకు ఎస్పీ వాసుకు ప్రశాంసపత్రాన్ని అందజేశారు.

గుంటూరు చానల్ పనులను ప్రారంభించాలి

పెదనందిపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గుంటూరు చానల్‌కు నిధులు కేటాయించి పనులను ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు తెలిపారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను త్వరతిగతిన అమలు చేయాలన్నారు. నల్లమడ ఆధునికీకరణ పనులను కూడా ప్రారంభించాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిర్చి ధర రోజురోజుకు పతనం అవుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. క్వింటా రూ.20 వేలకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, జయశంకర్‌రావు, షేక్ షమీ, లక్ష్మీ, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో విపత్తుల నిర్వహణ శాఖచే మాక్ డ్రిల్

తాడేపల్లి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని మహానాడు 1వ నెంబరు రోడ్డు అంగన్‌వాడి స్కూల్ వద్ద విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్తుల సమయంలో జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ కమాండర్ సుజిత్, ఏఎస్ఐ నరేంద్ర సింగ్ యాదవ్, తహసీల్దార్ సీతారామయ్య, ఆర్ఐ వేదాంతరావు, డాక్టర్ శాంతకుమారి, ఎస్ఐ ఖాజావలి, నీటిపారుదల శాఖ ఏఈ సురేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, ఎలక్ట్రికల్ ఏఈ లక్ష్మణ్, ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నెట్‌వర్క్ ఆసుపత్రిల సమ్మె నోటీసు

తెనాలి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలలో వైద్య సేవలు అందించిన బిల్లులు చెల్లించాలని కోరుతూ నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మెకు సిద్ధమయ్యాయి. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు సంబంధిత ఆసుపత్రుల ప్రతినిధులు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద నిర్వహించిన వైద్య సేవల బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. లేని పక్షంలో ఏప్రిల్ 7నుంచి ఈ పథకం కింద సేవలు చేసేందుకు ఆసుపత్రులు సమ్మెకు వెళతాయని పేర్కొన్నారు. తెనాలి ఆసుపత్రులు హెల్త్ హాస్పటల్, మైత్రి హాస్పటల్, దివి హాస్పటల్, వి-కార్డియాక్, అవినాష్ నర్సింగ్ హోమ్ ప్రతినిధులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

నేడు పురపాలక సంఘ సాధారణ సమావేశం

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నేడు శనివారం పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నామని మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు ఉదయం గం.11.00లకు సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తామని మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫిషియో మెంబర్లు, కోఆప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.

మామిళ్లపల్లిలో న్యాయ అవగాహన సదస్సు

పొన్నూరుటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మామిళ్లపల్లిలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు జరిగింది. మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, మేజిస్ట్రేట్ పవన్‌కుమార్ 2012లో వచ్చిన పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలతో అసభ్యకరంగా కానీ, అనుచితంగా కానీ ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోక్సో చట్టం కింద కేసులు నమోదయితే విచారణ వేగవంతంగా జరిగి శిక్షలు కూడా కఠినంగా అమలవుతాయన్నారు. న్యాయ వ్యవస్థ బాల బాలికలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నైతిక విలువలతో తల్లిదండ్రులను విద్య నేర్పే గురువులను గౌరవించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మండే సుబ్రహ్మణ్యంకు సత్కారం

పొన్నూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంకు చెందిన కవి, మండే సుబ్రహ్మణ్యంకు తమిళనాడులోని చెన్నై ఉగాది వేడుకలలో కవి సత్కారం లభించింది. చెన్నైలోని మెరీనా ఆవరణలో శుక్రవారం తెలుగు శాఖ మద్రాస్ విశ్వవిద్యాలయం ఆవరణలో విశ్వవసు ఉగాది వేడుకలలో కవి సమ్మేళనం నిర్వహించారు. తెలుగు భాషా ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మండే సుబ్రహ్మణ్యం ఈ సమ్మేళనంలో పాల్గొని లెస్స భాస విశ్వతారా విజేత, గురువంటే అనే స్వీయ కవిత పఠనంలో తెలుగు ఖ్యాతిని చాటిచెప్పారు. తెలుగు నాట తెలుగు, భాషా గొప్పతనాన్ని చాటిచెప్పిన సుబ్రహ్మణ్యంను తెలుగు శాఖ అధ్యక్షుడు వి.శంకర్‌రావు, సినీ గేయ రచయిత భువనచంద్ర, అనంత పద్మనాభమూర్తి, తమిళనాడు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తుమ్మలనేని బాబు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ తిరుమల ఆముక్తమాల్యద, తదితరులు సత్కరించారు.

వెనిగండ్ల కల్యాణ మండపంలో అక్రమాలు జరుగుతున్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదు

పెదకాకాని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం వెనిగండ్లలోని పంచాయతీ కార్యాలయానికి చెందిన కల్యాణ మండపంలో అక్రమాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన కొందరు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఐదున్నర సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ అధీనంలోని కల్యాణ మండపంలో మైక్, లైటింగ్, ఫ్లవర్ డెకరేషన్‌లకు అప్సెట్ ధర నిర్ణయించి పాటలు పెట్టనందున గ్రామ పంచాయతీ రూ.రెండు కోట్లకు పైగా ఆదాయం నష్టపోయిందన్నారు ప్రైవేట్ వ్యక్తులకు కల్యాణ మండపం అక్రమ ఆదాయ వనరుగా మారిందని, జరిగిన నష్టాన్ని పూడ్చలేకపోయినా ఇక ముందైనా ఆ నష్టం వాటిల్లకుండా టెండరుద్వారా పాటలు పెట్టించి పంచాయతీకి ఆదాయం పెరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్‌కార్డు దారులందరికీ ఈకేవైసీ చేయించాలి: తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరికీ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ వాహనదారులు, వీఆర్వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ మండలంలో 2వేల897మంది రేషన్‌కార్డు దారులకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం ద్వారా ఇచ్చే నిత్యావసరాలు రావని తెలిపారు. రేషన్‌కార్డు కూడా రద్దయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్వీ ఐటీలో సందడిగా రేకాన్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు ఆర్‌వీఐటీ కళాశాలలో శుక్రవారం రేకాన్ 2025 పేరుతో కల్చరల్, టెక్నికల్ ఈవెంట్ కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ సందర్భంగా యూకే దేశానికి చెందిన సాంకేతిక నిపుణులు డాక్టర్ సంధ్యా దాసరి పాల్గొని రేకాన్‌ను ప్రారంభించారు. తొలిరోజు శుక్రవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం రేకాన్ ముగింపు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణయ్య, ప్రెసిడెంట్ ఆర్ వంశీకృష్ణ, నర్రా సాంబశివరావు, వివిధ విభాగాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శుక్రవారం మండలంలోని నందివెలుగులో కూటమి నాయకులు నన్నపనేని బసవపున్నయ్య, లింగారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమానికి మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన చేతులమీదుగా తోఫా పంపిణీ చేశారు. మనోహర్ మాట్లాడుతూ రంజాన్ పండుగవేళ ముస్లింలను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మనిషిలోని చెడుభావాన్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ అని పేర్కొన్నారు. అల్లా దయతో ప్రజలందరూ సంతోషకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. తోఫా కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

నిర్వాహకులను మంత్రి మనోహర్ అభినందించారు. కార్యక్రమంలో అజిముతుల్లా, ఎస్‌కే సుభాని, బుజ్జి, అక్బర్, మౌలాలి, మహబూబ్ సుభాని పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మారీసుపేట 22వ వార్డులో జనసేన నాయకులు జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి మనోహర్ పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నియమనిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలను ఇఫ్తార్‌లో కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. వారిని ఆప్యాయంగా పలకరించి ఇఫ్తార్ విందును స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న కాటూరి

మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఖ్యాతిని కాటూరి ఆర్ట్ గ్యాలరీ ద్వారా నలుదిశలకు ఇనుమడింపజేస్తున్న శిల్పి కాటూరి వెంకటేశ్వరావు అభినందనీయుడని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్‌లోని సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఉగాది పురస్కార అవార్డులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, ఏసీపీ శివన్నారాయణతో కలసి సందర్శించారు. ఉగాది పండుగ రోజు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాలలో ప్రతిభ చాటిన కళాకారులకు అందించే హంస, తెలుగుతల్లి మెమెంటోలను తిలకించి కాటూరి కళా నైపుణ్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషన్న మాట్లాడుతూ కాటూరి కళా నైపుణ్యం అబ్బుర పరుస్తోందన్నారు. ఇనుప వ్యర్థాలతో అమరావతి, జీప్, రైతు, పలువురు స్వాతంత్ర్య సమర యోధులు ఇతర విగ్రహాలు తయారుచేసి దేశ విదేశాల్లో ప్రతిష్టేపచేసి తెనాలి పేరును ఖండంతరాలకు ఎక్కించారన్నారు. ఉగాది పండుగ సందర్భంగా ప్రభుత్వం పలు రంగాలలో ప్రతిభ చాటిన వారికి అందించే ఉగాది పురస్కారాలు తెనాలి నుంచే తయారు చేయించడం ఈ ప్రాంత ప్రజలు గర్వించదగ్గ విషయమన్నారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు వెంకటేశ్వరరావు, కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలకు మునిసిపాలిటి తరుపున అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామన్నారు.


మెమెంటోను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న, శిల్పి వెంకటేశ్వరరావు, రవితేజ తదితరులు

తొలుత మునిసిపల్ కమిషనర్ శేషన్నని శిల్పులు వెంకటేశ్వరరావు, రవితేజ, శ్రీహర్షలు దుశ్శాలువాలతో సత్కరించి మెమెంటోను అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ, ఏఈ సూరిబాబు, కార్తిక్, ఆర్ట్ గ్యాలరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పన్నులు చెల్లించవచ్చు

● మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సెలవు రోజుల్లోనూ పన్నులు చెల్లించవచ్చని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శుక్రవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలోని తన చాంబరులో కమిషనర్ శేషన్న అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31వ తారీఖులలో సెలవులు అయినప్పటికి పురపాలక సంఘంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించి తగిన రసీదును పొందాలని, వడ్డీలో 50 శాతం రాయితీని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఆర్‌వో రాంప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌ఖన్నా, అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక నందులపేట 4వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరావు, అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ సూరిబాబు, టీపీవో సాంబశివరావు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధురాలికి బంగారు నగలను అప్పగిస్తున్న సాంబశివరావు

వృద్ధురాలికి బంగారు నగలు అప్పగింత

కొల్లిపర, మార్చిన 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నంగిలో కుర్రె వెంకటసుబ్బమ్మ (74) పాత చీరలను తెనాలి నందులపేటకు చెందిన తాడిశెట్టి సాంబశివరావుకు గురువారం కొల్లిపరలో నాలుగు చీరలను అమ్మింది. నాలుగు చీరల్లో 56 గ్రాములు విలువల బంగారు గాజులు, గొలుసు ఉన్నాయి. అనంతరం నగలు పోయినట్లు గమనించి వెంకటసుబ్బమ్మ కొల్లిపర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సాంబశివరావు ఇంటికి వెళ్ళిన వెంటనే చీరల్లో నగలు ఉండటం గమనించి కొల్లిపర పోలీసుస్టేషన్‌లో నగలను అప్పగించాడు. శుక్రవారం వెంకటసుబ్బమ్మకు పోలీసుస్టేషన్‌లో సాంబశివరావు నగలు అప్పగించడంతో ఎస్ఐ కోటేశ్వరరావు అభినందించారు.



విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

విద్యుత్ బిల్లుల భారం దుర్మార్గం: శివసాంబిరెడ్డి

కొల్లిపర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బిల్లులు భారం మోపటం దుర్మార్గమని సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో విద్యుత్ బిల్లులు పెంపుపై సీపీఎం, సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించడంతో పాటు సర్‌చార్జీలు భారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్ల వల్ల గతంలో కంటే రెట్టింపు విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. వ్యవసాయానికి, గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించే పద్ధతిని విడనాడాలని లేకపోతే ఆందోళనను ఉధృతం చేయనున్నట్లు ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్, సీఐటీయూ, సీపీఎం నాయకులు బత్తుల సుబ్బారావు, ఎం.రమేష్, ఎ.పూర్ణచంద్రరావు, పి.ఏసుపాదం, కె.పిచ్చయ్య, ఎం.మరియమ్మ, జి.దీనమ్మ, కె.సీతమ్మ, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల రద్దు కోరుతూ ఆందోళన

తెనాలి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అన్ని రకాల విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. చెంచుపేట ట్రాన్స్ కో ఈఈ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు కె.బాబుప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలపై ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. చార్జీల భారాన్ని సామాన్యులు మోయలేకపోతున్నారని, అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ట్రూఅప్ చార్జీలను రద్దు చేయలేదన్నారు. ములకా శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈఈ చిరంజీవికి వినతిపత్రం అందించారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటిద్దాం: ఇన్‌చార్జ్ జిల్లా మలేరియా అధికారి

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని ఇన్‌చార్జ్ జిల్లా మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మారీసుపేట చంద్రబాబు నాయుడు కాలనీలో పట్టణ మలేరియా అధికారులు ఆరోగ్య సిబ్బందితో కలసి ఫ్రైడేను డ్రైడే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి పాల్గొని ప్రజలకు దోమల నివారణపై అవగాహన కలిగించారు. పట్టణంలో ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, యూఎల్‌బీ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ కరిముల్లా, షేక్ నవీద్, సంకా శరత్‌బాబు, ఏఎన్‌ఎంలు కె రాజ్యం, సీహెచ్ సునీత, ఆశా కార్యకర్తలు కె నాగలక్ష్మి, ఏ యశోద తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న సీఐ మల్లికార్జునరావు

సీఐ మల్లికార్జునరావుకు ప్రోత్సాహక నగదు బహుమతి

తెనాలి క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ల, సంఘ వ్యతిరేక శక్తులతో కఠినంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతల విషయంలో చురుకుగా వ్యవహరిస్తున్న వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావును జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శుక్రవారం గుంటూరు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి రూ.25 వేల ప్రోత్సాహక బహుమతిని అందించారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన రౌడీషీటర్ అన్నం సతీష్‌పై గతంలో బాపట్ల, తెనాలి పోలీస్‌స్టేషన్ పరిధిలో అనేక కేసులు ఉన్నాయి. 2023లో గుంటూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాత్రి 8 సమయంలో బంధువుల ఇంటికి తెనాలి రాగా అతన్ని ఆటో ఎక్కించుకుని కఠెవరం వైపు తీసుకువెళ్లి అడిగినంత నగదు ఇవ్వలేదని కొట్టి చెరువులో పడవేయడంతో అతను మృతి చెందాడు. ఇంకా పలు కేసుల్లో కూడా ముద్దాయిగా ఉన్నాడు. అనేకసార్లు హెచ్చరించినా తిరిగి రౌడీయిజం చెలాయిస్తుండటంతో తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. అయినా నేరాలకు పాల్పడటంతో ఈ నెల 20న రౌడీషీటర్‌కి తహసీల్దార్ రూ.2 లక్షల జరిమానా లేదా 30 రోజుల రిమాండ్ విధించారు. జరిమానా చెల్లించకలేకపోవడంతో రౌడీషీటర్ అన్నం సతీష్‌కి 30రోజుల రిమాండ్‌కు సీఐని తరలించారు. ఈ విధంగా పలు కేసుల్లో సీఐ మల్లికార్జునరావు వేగవంతమైన చర్యలను అభినందిస్తూ నగదు ప్రోత్సాహక బహుమతిని అందించారు.

రుణమేళాకు 266 మంది హాజరు

కొల్లిపర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, బ్యాంకు మేనేజర్లు ఆధ్వర్యంలో రుణమేళా నిర్వహించారు. రుణమేళాకు మండలంలోని గ్రామాల నుంచి 357మంది దరఖాస్తు చేసుకోగా 266మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. 266మందిలో కాపు 18 మందికి, బీసీలకు 45 మందికి, ఈబీసీకి 2, బ్రాహ్మణ ఒకటి, కమ్మ 8, రెడ్డి 5, ఆర్యవైశ్యులకు ఇద్దరికి, వీరితో పాటు జనరిక్ మెడిషిన్ షాపు పెట్టుకుంటే నలుగురికి స్వయం ఉపాధి పథకం ద్వారా రుణాలు మంజూరు చేయటానికి అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

● పొన్నూరు టౌన్ (చేబ్రోలు): చేబ్రోలు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్పొరేషన్‌ల రుణ మంజూరు కోసం అర్హుల ఎంపిక క్రెడిట్ క్యాంప్ జరిగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి 371మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 328 మంది అభ్యర్థులు క్రెడిట్ క్యాంప్‌కు హాజరయ్యారు. అభ్యర్థులను బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, పలు బ్యాంక్‌ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు

ఘనంగా ప్రోడిజి విద్యాలయ గ్రాడ్యుయేషన్ డే

గుంటూరు (విద్య) మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుడంపాడులోని ప్రొడిజి విద్యాలయంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక తరగతి నుంచి మరో తరగతికి మారే సమయంలో వారి నైపుణ్యాలను అంచనా వేసి ప్రశంసించడం గ్రాడ్యుయేషన్ డే లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే సామాజిక, నైతిక విలువల్ని పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సూర్యకుమారి, ప్రిన్సిపాల్ రధినీ చౌదరి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రంజాన్ వేడుకలకు మసీదులు సిద్ధం

పొన్నూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు మసీదులను రంజాన్ వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. పొన్నూరు పట్టణంలోని పలు మసీదులను ఇప్పటికే రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పొన్నూరు పట్టణంలోని పలు వీధులలో రంజాన్ పండుగ ప్రతీకగా గుర్తించే నెలవంక మసీదు మీనార్ ఆకృతులను విద్యుద్దీపాలతో అకర్షణీయంగా ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్ సమీపంలో ఇస్లాంపేట ముస్లిం యూత్ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద షరాఫ్ బజార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నెలవంకలు పట్టణ వాసులను అమితంగా ఆకర్షిస్తున్నాయి.


ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటుచేసిన మసీదు, నెలవంక ఆకృతి

మసీదు వద్ద మజ్జిగ పంపిణీ

పొన్నూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని డీవీసీ కాలనీలోని మస్జిద్ ఏ ఫాతిమా వద్ద శుక్రవారం మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించి నమాజ్ అనంతరం దీక్షలు విరమించిన ముస్లిం సోదరులకు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్‌ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, చిలకపాటి సింహాద్రి, గోపిశెట్టి సురేష్, అనీల్ నాయుడు, జాహ్నవి, మేఘనాథ్, తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఉమాశంకర్ తదితరులు



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

● ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు రామారావు

పొన్నూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలు నిరసనలకు దిగాయి. ఈ సందర్భంగా ఆరేటి రామారావు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లైయిమ్‌లు పరిష్కరిస్తామని కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారన్నారు. కార్మికుల కుటుంబాలను ఆదుకోవడానికి సంక్షేమ బోర్డు పునరుద్ధరించి రూ.కోటి విరాళంగా ఇస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారన్నారు. కానీ ఆ హామీలు అమలు కాక కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు గడుస్తున్నా ఒక్క హామీ కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. కార్మికులు కుమార్తెల వివాహాలకు ఇచ్చే ఆర్థికసాయం కూడా నిలిచిపోయిందన్నారు. కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వాన్ని తెలియజెప్పేందుకు చలో జంతర్ మంతర్ నిర్వహిస్తున్న సందర్భంగా వారికి సంఘీభావంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు గుమ్మడి రోశయ్య, శివాజీ, మిక్కిలి జాన్, బ్రహ్మం, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి రామలింగేశ్వరశాస్త్రి

అర్చక సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

● సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామలింగేశ్వరశాస్త్రి

తెనాలి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తుందని అర్చక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేవీ రామలింగేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. రాష్ట్ర సంఘ సమావేశం శుక్రవారం పట్టాభి రామస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరశాస్త్రి మాట్లాడుతూ ఉపనయన గ్రాంటు వివాహం, విద్య, గృహ రుణం, వైద్యం, పదవీ విరమణ మొత్తాలను గత ప్రభుత్వం 50శాతం తగ్గిస్తే దేవదాయ మంత్రి అధికారులతో చర్చించి నూరు శాతానికి పునరుద్ధరింపజేయాలని నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. అర్చకుల కనీస వేతనం రూ.15వేలు, ధూప, దీప నైవేద్యాలకు రూ.10 వేలు, నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తూ వెంటనే అమలు చేయాలని జీవో జారీ చేశారని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల 90వేల అర్చక కుటుంబాలు ఇబ్బందుల పాలయ్యాయని చెప్పారు. సంఘ అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్, శేషాచార్యులు, రాధాకృష్ణమూర్తి, కృష్ణమాచార్యులు, శేషబాబు, జగన్‌మోహన్, ఆంజనేయులు, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సదరం రీ వెరిఫికేషన్‌కు వందమంది హాజరు

తెనాలి రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వారంలో మూడు రోజులు నిర్వహిస్తున్న సదరం రీ వెరిఫికేషన్ ప్రత్యేక శిబిరానికి చివరి రోజు శుక్రవారం వివిధ విభాగాలకు చెందిన సుమారు 100మంది హాజరై వైద్యుల ద్వారా పరీక్షలు చేయించుకున్నారు. వారి వైకల్య శాతం వివరాలను వైద్యులు ఆన్‌లైన్ ద్వారా నమోదుచేశారు. పలువురు వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.